SAMAYAM

epaper.samayamdaily.net APTEL/2006/18267

# సమయం

మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక

## విలేకరులు కావలెను

తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.

ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.

జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.

ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 318 ఎడిటర్ : విక్రం కుమార్ సోమవారం 28, జులై 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

# భారతరత్న కలాంకు ప్రధాని మోదీ ఘన నివాళి..

## ఆయనొక స్ఫూర్తిదాయక దార్శనికుడు



- మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ప్రధాని మోదీ నివాళి
- కలాం స్ఫూర్తిదాయక దార్శనికుడు, గొప్ప శాస్త్రవేత్త అని కొనియాడిన మోదీ
- యువతకు ఆయన ఆలోచనలు ఎంతో ప్రేరణ ఇస్తాయని 'X' లో పోస్ట్
- భారత్‌ను అణుశక్తిగా మార్చడంలో కలాం పాత్ర మరువలేనిదన్న జేపీ నడ్డా
- మిసైల్ మ్యాన్‌కు యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ సహా పలువురు ప్రముఖుల నివాళులు

భారత మాజీ రాష్ట్రపతి, భారతరత్న డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ఆయనకు ఘనంగా నివాళులర్పించారు. కలాం ఒక స్ఫూర్తిదాయక దార్శనికుడని, గొప్ప శాస్త్రవేత్త అని, ఆదర్శవంతమైన దేశభక్తుడని ప్రధాని కొనియాడారు. దేశ యువతకు ఆయన ఆలోచనలు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తూనే ఉంటాయని పేర్కొన్నారు. ఆదివారం కలాం వర్ధంతి సందర్భంగా ప్రధాని మోదీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ 'X' ద్వారా స్పందించారు. "మన ప్రియతమ మాజీ రాష్ట్రపతి డాక్టర్ ఏపీజే అబ్దుల్ కలాంకు ఆయన వర్ధంతి నాడు నివాళులర్పిస్తున్నాను. దేశం పట్ల ఆయనకున్న అంకితభావం ఆదర్శప్రాయం. అభివృద్ధి చెందిన, బలమైన తరువాయి 2లో



## రేవంత్ రెడ్డి నుంచి మాటలు కాదు... చేతలు కావాలి : హరీశ్ రావు

2లో

## ఐదేళ్లలో ఎంత నష్టం జరిగిందో

## అంతకు వడ్డీతో కలిపి తీసుకువస్తాం

- సింగపూర్ లో తెలుగు డయాస్పొరాతో మంత్రి నారా లోకేశ్ సమావేశం
- రాష్ట్ర పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం కష్టపడుతోందని వెల్లడి
- సింగపూర్ ను ఆదర్శంగా తీసుకుని కొత్త విధానాలు అమలు చేస్తున్నామని స్పష్టీకరణ




ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏపీ ఎంతలా నాశనమైందో మీకు తెలుసు... రాష్ట్ర పునర్నిర్మాణానికి కూటమి ప్రభుత్వం ఎంత కష్టపడుతోందో మీరంతా చూస్తున్నారు.... చంద్రబాబు గారి పట్ల ప్రపంచ వ్యాప్తంగా ఉన్న నమ్మకమే మన పెట్టుబడి... మన రాష్ట్రంలో ఉన్న అవకాశాలను తరువాయి 2లో

## బీఆర్ఎస్ విలీనం కోసం ప్రయత్నించారంటూ సీఎం రమేశ్ ఆరోపణ.. స్పందించిన కేటీఆర్

- తెలంగాణ ఉన్నంత వరకు బీఆర్ఎస్ ఉంటుందన్న కేటీఆర్
- విలీనం చేసే ప్రసక్తే లేదని స్పష్టీకరణ
- ఇది పసలేని వాదన అంటూ వ్యాఖ్యలు



2లో

## ఛత్తీస్ గఢ్ లో మరో ఎన్ కౌంటర్... నలుగురు మావోల మృతి

2లో



## హరిద్వార్ లో విషాదం..

## ఆలయంలో తొక్కిసలాట

- ఆరుగురు భక్తులు మృతి
- పలువురికి తీవ్ర గాయాలు.. మృతుల సంఖ్య పెరిగే అవకాశం
- ఆదివారం ఉదయం ఆలయానికి పెద్ద సంఖ్యలో వచ్చిన భక్తులు
- గాయపడిన వారిని హుటాహుటిన ఆసుపత్రికి తరలించిన అధికారులు

ఉత్తరాఖండ్ లోని హరిద్వార్ లో తీవ్ర విషాదం చోటుచేసుకుంది. మానసాదేవి ఆలయంలో తొక్కిసలాట జరగడంతో ఆరుగురు భక్తులు చనిపోయారు. మరికొందరికి గాయాలయ్యాయని సమాచారం. శ్రావణ మాసం సందర్భంగా ఆదివారం ఆలయానికి భక్తులు పోటెత్తారు. పెద్ద సంఖ్యలో భక్తులు రావడంతో క్యూలైన్ లో తోపులాట చోటుచేసుకుంద తరువాయి 2లో

## సింగపూర్ తో గ్యాప్ వచ్చింది...

## అది సరిచేయడానికే వచ్చాను

### : సీఎం చంద్రబాబు

- సింగపూర్ లో తెలుగు వారితో సీఎం చంద్రబాబు సమావేశం
- సింగపూర్ మళ్లీ ఏపీ క్యాపిటల్ నిర్మాణానికి ముందుకు రాకపోవచ్చన్న చంద్రబాబు
- కానీ జరిగిందేమిటో వారికి వివరిస్తానని వెల్లడి

ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు సింగపూర్ పర్యటన తొలిరోజున ఏపీఎన్ఆర్టీ భాగస్వామ్యంతో ఏర్పాటైన తెలుగు డయాస్పొరా కార్యక్రమంలో పాల్గొన్నారు. సింగపూర్ తో పాటు, పొరుగున్న మరో ఐదు దేశాల నుంచి తెలుగు ప్రజలు భారీ ఎత్తున ఈ కార్యక్రమానికి హాజరుకావడంతో చంద్రబాబు సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన ఆసక్తికరంగా ప్రసంగించారు. తరువాయి 2లో






## థాయ్‌లాండ్, కంబోడియా మధ్య ఘర్షణలపై

## ట్రంప్ కీలక ప్రకటన

- మరోసారి శాంతి దూతగా మారిన ట్రంప్
- థాయ్‌లాండ్, కంబోడియా మధ్య గత మూడు రోజులుగా ఘర్షణలు
- ఇరు దేశాల మధ్య ఘర్షణలకు త్వరలోనే ముగింపు అన్న ట్రంప్

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తన మధ్యవర్తిత్వంతోనే పాక్, భారత్ మధ్య కాల్పులు నిలిచాయని పదేపదే చెప్పిన విషయం తెలిసిందే. తాజాగా ఆయన మరోసారి శాంతి దూతగా మారారు. థాయ్‌లాండ్, కంబోడియా మధ్య గత మూడు రోజులుగా జరుగుతున్న ఘర్షణలకు త్వరలోనే ముగింపు పడనుందని ట్రంప్ ప్రకటించారు. ఇరు దేశాలు తక్షణ కాల్పుల తరువాయి 2లో

# భారతరత్న కలాంకు ప్రధాని మోదీ ఘన నివాళి.. ఆయనొక స్ఫూర్తిదాయక దార్శనికుడు

(మొదటిపేజీ తరువాయి)

భారత్‌ను నిర్మించేందుకు ఆయన ఆలోచనలు దేశంలోని యువతను ప్రేరేపిస్తాయి" అని మోదీ తన పోస్ట్‌లో రాశారు. రాష్ట్రపతి కాకముందే "రాష్ట్ర రత్న"గా ప్రజల మన్ననలు పొందిన అరుదైన వ్యక్తి కలాం అని గతంలో మోదీ ప్రశంసించిన విషయం తెలిసిందే. భారతదేశ 11వ రాష్ట్రపతిగా 2002 నుంచి 2007 వరకు సేవలందించిన డాక్టర్ కలాం, నిరాడంబర జీవితం, నిష్పక్షపాత వైఖరితో ప్రజలందరి గౌరవాన్ని పొందారు. 'మిసైల్ మ్యాన్ ఆఫ్ ఇండియా'గా పేరుగాంచిన ఆయన, దేశ రక్షణ వ్యవస్థ బలోపేతానికి విశేష కృషి చేశారు. ఇంటిగ్రేటెడ్ గైడెడ్ మిసైల్ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్‌కు నేతృత్వం వహించి అగ్ని, పృథ్వీ వంటి శక్తివంతమైన క్షిపణుల రూపకల్పనలో కీలక పాత్ర పోషించారు. 1998లో జరిగిన పోఖ్రాన్II అణు పరీక్షల్లోనూ ఆయన ముఖ్య సమన్వయకర్తగా వ్యవహరించారు. కలాం వర్ధంతి సందర్భంగా బీజేపీ జాతీయ అధ్యక్షుడు, కేంద్ర మంత్రి జేపీ నడ్డా కూడా నివాళులర్పించారు. కలాం జీవితం అద్భుతమైన పోరాటానికి, విజయానికి నిదర్శనమని పేర్కొన్నారు. భారత్‌ను అణుశక్తిగా నిలపడంలో ఆయన అందించిన సేవలు మరువలేనివని నడ్డా అన్నారు. ఉత్తరప్రదేశ్ ముఖ్యమంత్రి యోగి ఆదిత్యనాథ్ స్పందిస్తూ, కలాం జీవితంలోని నిరాడంబరత, దేశభక్తి యావత్ దేశానికే ప్రేరణ అని కొనియాడారు. ఆయన ఆలోచనలు శాస్త్ర, విద్యా రంగాలకు ఎప్పటికీ వెలుగునిస్తాయని తెలిపారు. ప్రజల రాష్ట్రపతిగా గుర్తింపు పొందిన డాక్టర్ కలాం, యువతకు, విద్యార్థులకు స్ఫూర్తినివ్వడాన్ని ఎంతగానో ఇష్టపడేవారు. 2015 జులై 27న షిల్లాంగ్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తుండగా గుండెపోటుతో కుప్పకూలి తుదిశ్వాస విడిచారు.

# బీఆర్ఎస్ విలీనం కోసం ప్రయత్నించారంటూ సీఎం రమేశ్ ఆరోపణ.. స్పందించిన కేటీఆర్

తెలంగాణ ఉన్నంతవరకు బీఆర్ఎస్ ఉంటుందని, తమ పార్టీని మరే ఇతర పార్టీలోనూ విలీనం చేసే ప్రశ్నే లేదని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. బీజేపీ ఎంపీ సీఎం రమేశ్ చేసిన ఆరోపణలకు కేటీఆర్ పై విధంగా స్పందించారు. బీఆర్ఎస్ విలీనం అనే అంశం పసలేని వాదన అని కొట్టిపారేశారు. రాజకీయ ఇరకాటంలో పడిన ప్రతిసారీ బీజేపీ, కాంగ్రెస్ లు ఈ విలీనం అంశాన్ని తీసుకువస్తుంటాయని విమర్శించారు. స్కాంల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఇప్పుడు విలీనం అంశం తెరపైకి తెచ్చారని కేటీఆర్ ఆరోపించారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, సీఎం రమేశ్ ఇద్దరూ కలిసి వస్తే తాను చర్చకు సిద్ధమని స్పష్టం చేశారు.

# హరిద్వార్ లో విషాదం.. ఆలయంలో తొక్కిసలాట

(మొదటిపేజీ తరువాయి)

ని తెలుస్తోంది. ప్రమాదం గురించి సమాచారం అందడంతో ఎమర్జెన్సీ బృందాలు హుటాహుటిన ఆలయానికి చేరుకున్నాయి. గాయపడిన భక్తులను దగ్గర్లోని ఆసుపత్రులకు తరలించాయి. ఈ ఘటనలో గాయపడిన భక్తులలో కొందరి పరిస్థితి సీరియస్ గా ఉందని వైద్యులు తెలిపారు. దీంతో మృతుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని అధికారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మానసా దేవి ఆలయంలో తొక్కిసలాట జరిగి ఆరుగురు చనిపోయిన విషయాన్ని గర్వాల్ డివిజనల్ కమిషనర్ వినయ్ శంకర్ పాండే ధ్రువీకరించారు. విషయం తెలిసిన వెంటనే ఆలయం వద్దకు బయలుదేరానని, ఘటనా స్థలాన్ని పరిశీలించాక ప్రమాదానికి సంబంధించిన పూర్తి వివరాలు వెల్లడిస్తామని ఆయన తెలిపారు.

# థాయ్‌లాండ్, కంబోడియా మధ్య ఘర్షణలపై ట్రంప్ కీలక ప్రకటన

విరమణ చర్చలకు అంగీకరించాయన్నారు. ప్రస్తుతం కంబోడియా పర్యటనలో ఉన్న ఆయన ఇరు దేశాధినేతలతో ప్రత్యేకంగా మాట్లాడినట్లు తెలిపారు. ఘర్షణలు ఇలాగే కొనసాగితే అమెరికాతో వాణిజ్య ఒప్పందాలు ప్రమాదంలో పడతాయని ఇద్దరినీ హెచ్చరించానని తన సామాజిక మాధ్యమం ట్రూత్ సోషల్ వేదికగా ప్రకటించారు. దాంతో రెండు దేశాలు దారికి వచ్చాయని తెలిపారు. దెబ్బకు దిగొచ్చి శాంతి చర్చలకు అంగీకరించాయని తన పోస్టులో పేర్కొన్నారు.

**థాయ్‌లాండ్, కంబోడియా మధ్య ఘర్షణలు.. 32 మంది మృతి**

కాగా, థాయ్‌లాండ్, కంబోడియా మధ్య ఘర్షణలు శనివారం మూడవ రోజుకు చేరుకున్నాయి. ఈ ఘర్షణల్లో మృతుల సంఖ్య 32కి చేరుకుంది. 1,30,000 మందికి పైగా నిరాశ్రయులయ్యారు. ఐక్యరాజ్యసమితికి చెందిన భద్రతా మండలి శుక్రవారం న్యూయార్క్‌లో రహస్యంగా అత్యవసర సమావేశం నిర్వహించి థాయ్‌కంబోడియా తాజా ఘర్షణలపై చర్చలు జరిపింది. కాగా, ఘర్షణ పడుతున్న రెండు దేశాలతో పాటు 10 ఆగ్నేయాసియా దేశాలతో కూడిన ప్రాంతీయ సంఘం ఆసియాన్‌కి సారథ్యం వహిస్తున్న మలేషియా కాల్పుల విరమణ జరపాలని ఇరు దేశాలకు పిలుపునిచ్చింది.

# రేవంత్ రెడ్డి నుంచి మాటలు కాదు... చేతలు కావాలి

నాగర్ కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడలోని బాలిక వసతి గృహంలో ఫుడ్ పాయిజన్ జరగడంపై బీఆర్ఎస్ నేత హరీశ్ రావు స్పందించారు. ఫుడ్ పాయిజన్ కు గురై చికిత్స పొందుతున్న బాలికలను హరీశ్ రావు నేడు పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన రాష్ట్ర ప్రభుత్వంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. సీఎం రేవంత్ రెడ్డి నుంచి మాటలు కాదు... చేతలు కావాలని స్పష్టం చేశారు.

# మళ్లీ ఒకే వేదికపై మెరిసిన ఉద్ధవ్‌రాజ్ సోదరులు



ముంబయి: విడిపోయిన అన్నదమ్ములు ఉద్ధవ్ ఠాక్రే , రాజ్ ఠాక్రేలు మరోసారి ఒకే వేదికపై మెరిశారు. మహారాష్ట్ర ప్రభుత్వ త్రిభాషా సూత్రానికి వ్యతిరేకంగా ఇటీవల వర్లిలో చేపట్టిన ఉమ్మడి నిరసన కార్యక్రమంలో దాదాపు 20 ఏళ్ల తర్వాత ఒకే వేదికను పంచుకున్న ఈ సోదరులు.. తాజాగా మాతోశ్రీ వేదికగా సమావేశమయ్యారు. మాజీ సీఎం, శివసేన (యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే పుట్టిన రోజు వేడుకల వేళ ఈ పరిణామం చోటుచేసుకుంది. మహారాష్ట్ర నవనిర్మాణ్ సేన అధ్యక్షుడు రాజ్‌ఠాక్రే ఆదివారం ఉద్ధవ్ నివాసమైన మాతోశ్రీకి తన అనుచరులతో కలిసి వచ్చారు. పుట్టిన రోజు సందర్భంగా తన సోదరుడికి పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు చెప్పారు. అలాగే, వీరిద్దరూ బాలాసాహెబ్ ఠాక్రే చిత్రపటం ముందు ఫొటో దిగారు. ఈ సందర్భంగా కరచా లనం చేస్తూ ఠాక్రే సోదరులిద్దరూ చిరునవ్వులు చిందించారు. ఈ సందర్భంగా రాజ్ ఠాక్రే బాలాసాహెబ్ కుర్చీకి నమస్కరించి ఆయన ఆశీస్సులు తీసుకొని నివాళులర్పించారు. మాతోశ్రీలో జరిగిన ఈ కలయిక ఇరు కుటుంబాల మధ్య నెలకొన్న ఉద్రిక్తతలను మరింతగా తగ్గించేందుకు, దాయాదుల మధ్య సంబంధాల్ని మెరుగుపరిచేందుకు ఓ సంకేతంగా రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. బాలాసాహెబ్ ఠాక్రే చివరి రోజుల్లో 2012లో రాజ్‌ఠాక్రే అధికారికంగా మాతోశ్రీని సందర్శించారు. ఆ తర్వాత 2019 జనవరిలో తన తనయుడు అమిత్ ఠాక్రే వివాహ వేడుకకు ఉద్ధవ్, ఆయన కుటుంబ సభ్యులను ఆహ్వానించి వెంటనే వెళ్లిపోయారు.

# సింగపూర్ తో గ్యాప్ వచ్చింది... అది సరిచేయడానికే వచ్చాను



అభిమానం... గౌరవం. నీతి, నిజాయతీలకు సింగపూర్ దేశం నిలువెత్తు నిదర్శనం. ఈ దేశంలో అవినీతి తక్కువ. సింగపూర్ రోడ్ల మీద ఒక్క కాగితం ముక్క కూడా కన్పించదు. చాలా కాలం క్రితమే చెత్తను కూడా ఎనర్జీగా కన్వెర్ట్ చేసే విధానాన్ని సింగపూర్ ఆచరణలో పెట్టింది. అదే తరహా విధానాన్ని హైదరాబాద్ నగరంలో అమలు చేశాను. చాలా మంది రాజకీయ నేతలు సింగపూర్ వచ్చి ఎంజాయ్ చేసి వెళతారు. కానీ ఏపీ సీఎం మాత్రం ఇక్కడికి వచ్చి తాను చేసిన మంచి పనులను అమలు చేస్తున్నారని సింగపూర్ దేశ మాజీ ప్రధాని లీ క్వాన్ యూ చెప్పారు. ఇలాంటి సింగపూర్ ప్రభుత్వంతో ఏపీకి గ్యాప్ వచ్చింది. నేను అడిగిన వెంటనే ఉచితంగా అమరావతి కోసం మాస్టర్ ప్లాన్ తయారు చేయడానికి సింగపూర్ ప్రభుత్వం అంగీకరించింది. సింగపూర్ ప్రభుత్వం చాలా దేశాల్లో టౌన్ షిప్ లు కట్టింది. కాబట్టి సీడ్ క్యాపిటల్ నిర్మాణం సింగపూర్ ప్రభుత్వానికే అప్పగించాను. కానీ 2019లో ప్రభుత్వం మారి సింగపూర్ ను తప్పు పట్టే పరిస్థితి తీసుకువచ్చారు. వాటిని సరిదిద్ది... రికార్డులు సరి చేయడానికే సింగపూర్ వచ్చాను. ఏపీ బ్రాండును సింగపూర్ లో తిరిగి నెలకొల్పడానికే వచ్చాను. మన రాష్ట్రంలో ఏ ఒక్కరు తప్పు చేసినా... తెలుగు వాళ్లే చేశారంటారు. ఆ అభిప్రాయాన్ని... సింగపూర్ ప్రభుత్వంలో, సింగపూర్ కంపెనీల్లో తొలగించేందుకు ప్రయత్నిస్తున్నాను. సింగపూర్ కు కలిగిన అసౌకర్యానికి బాధపడుతున్నానని వారికి చెబుతున్నాను. సింగపూర్ ప్రభుత్వం మళ్లీ సీడ్ క్యాపిటల్ నిర్మాణానికి ముందుకు రాకపోవచ్చు. జరిగిన వాస్తవాలను మాత్రం వారికి తెలియచేస్తాను. 2019లో కూడా మన ప్రభుత్వమే కొనసాగి ఉంటే.. అమరావతి సింగపూర్ స్థాయికి చేరేది. కానీ 2019 ఎన్నికల్లో గ్యాప్ వచ్చింది. మళ్లీ ఇలాంటి పొరపాట్లు రాకుండా చూసుకోవాలి. ఈ బాధ్యత నా మీదే కాదు... మీ మీద కూడా ఉంది" అని చంద్రబాబు భావోద్వేగంగా స్పందించారు.

**పెట్టుబడులతో రండి**

"గతంతో పోల్చుకుంటే ఇప్పుడు సాంకేతికంగా చాలా అంశాలు అందుబాటులోకి వచ్చాయి. అమరావతిలో క్వాంటం వ్యాలీని అభివృద్ధి చేస్తున్నాం. గ్రీన్ హైడ్రోజన్ వ్యాలీ ప్రకటించాం. సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. ఏపీలో 20 పోర్టులు వస్తాయి.. 15-20 ఎయిర్ పోర్టులకు అవకాశం ఉంది. ఆరోగ్య రంగంలో గేట్స్ ఫౌండేషన్, టాటా సంస్థలతో కలిసి పని చేస్తున్నాం. చాలా మంది తెలుగు వాళ్లు విదేశాల్లోని ప్రముఖ సంస్థల్లో కీలక స్థానాల్లో ఉన్నారు. ఇలాంటి వారు తమ అనుభవాన్ని ఏపీకి అందించవచ్చు. పీ4 కార్యక్రమం ద్వారా పేదరికాన్ని తగ్గించేందుకు నో పావర్టీ మిషన్ ప్రారంభించాను. మీ మీ గ్రామాల్లోని పేదలను దత్తత తీసుకోండి. విదేశాల్లో స్థిరపడిన తెలుగు వాళ్లు.. పీ4లో భాగస్వాములుగా ఉంటే.. నాకు అంతకు మించిన ఆనందం వేరొకటి ఉండదు.

**ఏపీలో వెంకన్న ఉండడం మన అదృష్టం**

"తిరుపతి బాలాజీ మన రాష్ట్రంలో ఉండడం అదృష్టం. ఎన్ని కష్టాలున్నా.. వేంకటేశ్వరస్వామిని తలుచుకుని సంకల్పం తీసుకుంటే సమస్య పరిష్కారమై పని అయిపోతుంది. ఎన్నార్టీలకు తిరుమల వెంకన్న దర్శనం కోసం ప్రత్యేకంగా ఏర్పాట్లు చేస్తాం. ప్రతి దేశ రాజధానిలో వెంకటేశ్వరస్వామి దేవాలయం ఉండాలి. సింగపూర్ నుంచి ఏపీలోని విజయవాడ, విశాఖ, తిరుపతికి నేరుగా విమానాలు వచ్చేలా చేస్తాం. ఈ మేరకు కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడతాం. సింగపూర్ లో బెంగాలీ, హిందీ, తమిళ్ రెండో భాషగా ఉన్నాయి. తెలుగు కూడా రెండో భాషగా పెట్టాలని కోరుతున్నాను. ఇక్కడే ఉన్న భారత హైకమిషనర్ ఈ మేరకు చొరవ తీసుకోవాలని కోరుతున్నాను" అని చంద్రబాబు చెప్పారు.

**సరైన నాయకుడు ప్రధాని మోదీనే**

"ప్రస్తుతం భారత దేశానికి ప్రజలే ఆస్తి. గతంతో పోల్చుకుంటే ప్రపంచ వ్యాప్తంగా భారత దేశానికి గౌరవం పెరిగింది. ఈ సమయంలో దేశానికి సరైన నాయకుడుగా ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం వహిస్తున్నారు. దేశంలో చాలా మంది ప్రధానులు... చాలా మంది సీనియర్ లీడర్లను చూశాను. రైట్ టైమ్, రైట్ ప్లేస్, రైట్ లీడర్ నరేంద్ర మోదీ. మోదీ మనకు పెద్ద వరం. అమెరికాకు చెందిన ఓ సంస్థ చేసిన సర్వేలో మోదీ ప్రపంచంలోనే పాపులర్ లీడరుగా నెంబర్ 1 స్థానంలో నిలిచారు. ప్రధానికి 75 శాతం అప్రూవల్ రేటింగ్ ఉంది. దేశానికి గుర్తింపు, సుస్థిరత మోదీ వల్లే వచ్చింది.

# ఐదేళ్లలో ఎంత నష్టం జరిగిందో అంతకు వడ్డీతో కలిపి తీసుకువస్తాం

ప్రచారం చేసి పెట్టుబడులు రాబడదామని రాష్ట్ర విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పిలుపునిచ్చారు. సింగపూర్ ఓవిస్ ఆడిటోరియంలో ఏపీఎన్ఆర్‌టీ ఆధ్వర్యాన నిర్వహించిన తెలుగు డయాస్పోరా సమావేశానికి మంత్రి లోకేశ్ అతిథిగా విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన ప్రసంగించారు. గత ఐదేళ్లలో రాష్ట్రం ఎంత నష్టపోయిందో, అంతకు అంత వడ్డీతో కలిపి తీసుకువస్తామని ధీమా వ్యక్తం చేశారు.

* **తెలుగువారిని ప్రపంచపటంలో నిలిపిన చంద్రబాబు**

తెలుగువారి ఆత్మగౌరవం కోసం పుట్టిన పార్టీ టీడీపీ అని, దానిని నిలబెట్టింది ఎన్టీ రామారావు గారని లోకేశ్ పేర్కొన్నారు. తెలుగువారిని ప్రపంచపటంలో నిలిపింది చంద్రబాబు అని, ఆయనే మన బ్రాండ్ అని అన్నారు. ఐటీ గురించి కొందరు విమర్శించినా, చంద్రబాబు ఇంజినీరింగ్ కళాశాలలను స్థాపించినప్పుడు విమర్శించినా, ఈ రోజు అదే కంప్యూటర్లతో తెలుగువారు ప్రపంచాన్ని శాసిస్తున్నారని గుర్తు చేశారు. ప్రపంచవ్యాప్తంగా 30 లక్షల మంది తెలుగు ప్రవాస భారతీయులు ఉండగా, ఫార్ ఈస్ట్‌లో మాత్రమే 3 లక్షల మంది ఉన్నారని, సింగపూర్ సమావేశానికి మలేషియా, ఇండోనేషియా, ఫిలిప్పీన్స్, ఇతర ఫార్ ఈస్ట్ దేశాల నుండి పెద్ద ఎత్తున తెలుగువారు తరలిరావడం మన శక్తికి నిదర్శనమని లోకేశ్ వ్యాఖ్యానించారు.

* **సీబీఎన్ బ్రాండ్ తో పెట్టుబడులు, 20 లక్షల ఉద్యోగాల సృష్టి**

ప్రతి దేశానికి, వస్తువుకు ఒక బ్రాండ్ ఉన్నట్లే, ఆంధ్రప్రదేశ్‌లో అభివృద్ధి అంటే సీబీఎన్ బ్రాండ్ అని లోకేశ్ స్పష్టం చేశారు. ఈ బ్రాండ్‌తో ప్రపంచంలో ఎక్కడికెళ్ళినా పెట్టుబడులు వస్తాయని, రాష్ట్రానికి పెట్టుబడులు సాధించే తమ ప్రయత్నాలకు ఎన్ఆర్ఐల సహకారం అవసరమని కోరారు. సింగపూర్‌ను ఆదర్శంగా తీసుకుని నూతన పారిశ్రామిక విధానాలు అమలు చేస్తున్నామని, వేగంగా వ్యాపారం చేసేందుకు అనుకూలమైన వాతావరణాన్ని సృష్టిస్తున్నామని తెలిపారు. దాదాపు 1000 కిలోమీటర్ల తీర ప్రాంతం, పోర్టులు, విమానాశ్రయాలు, హైవేలు, భూములు వంటి అపారమైన వనరులు ఆంధ్రప్రదేశ్‌లో ఉన్నాయని, ఇది పెట్టుబడులకు కేరాఫ్ అడ్రస్‌గా మారనుందని చెప్పారు. టీసీఎస్, కాగ్నిజెంట్, సత్వ, గూగుల్ వంటి దిగ్గజ సంస్థలు ఏపీకి వస్తున్నాయని, ఎస్ఆర్ఎం, విట్, అమృత వంటి విద్యాసంస్థలు వచ్చాయని, బిట్స్ పిలానీ త్వరలో రానుందని వెల్లడించారు. "20 లక్షల ఉద్యోగాల కల్పన... ఇదే మన నినాదం... ఇదే మన విధానం" అని లోకేశ్ పునరుద్ఘాటించారు. గతంలో చంద్రబాబు ఇచ్చిన పిలుపుతో జన్మభూమి కార్యక్రమానికి ఎన్నారైలు అండగా నిలిచారని, ఇప్పుడు జీరో పావర్టీ లక్ష్యంగా చంద్రబాబు తలపెట్టిన పీ4 (P4) కార్యక్రమంలో ప్రవాసులు భాగస్వాములు కావాలని కోరారు. పేదరికం లేని రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవాలన్నదే చంద్రబాబు గారి కోరిక అని, ఆరోగ్యవంతమైన, సంపన్నవంతమైన, సంతోషకరమైన ఆంధ్రప్రదేశ్ కోసం అందరూ కలిసి పని చేద్దామని పిలుపునిచ్చారు. పీ4 లో మార్గదర్శిగా చేరి పేద కుటుంబాలకు ఆసరాగా నిలవాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

* **డబుల్ ఇంజిన్ సర్కార్‌తో అభివృద్ధి, స్కిల్ డెవలప్‌మెంట్**

ఆంధ్రప్రదేశ్‌లో 'డబుల్ ఇంజిన్ సర్కార్' నడుస్తోందని, కేంద్రంలో నరేంద్ర మోదీ, రాష్ట్రంలో చంద్రబాబు నాయకత్వంలో పనిచేస్తున్నామని లోకేశ్ తెలిపారు. ఐదేళ్లలో రాష్ట్రానికి జరిగిన నష్టాన్ని వడ్డీతో సహా తిరిగి తీసుకొస్తామని హామీ ఇచ్చారు. ఇతర దేశాల్లో అవకాశాలను అందిపుచ్చుకునేందుకు స్కిల్ డెవలప్‌మెంట్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, ఎంఎస్ఎంఈ (సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు) కంపెనీలను కూడా ప్రోత్సహిస్తామని, ప్రపంచవ్యాప్తంగా 80 శాతం ఉద్యోగాలు ఎంఎస్ఎంఈల ద్వారానే వస్తున్నాయని పేర్కొన్నారు. టీసీఎస్‌లో 35 శాతం తెలుగువారు పనిచేస్తున్నారని, అందుకే ఏపీకి వస్తున్నామని టాటా ఛైర్మన్ చంద్రశేఖరన్ చెప్పారని లోకేశ్ గుర్తు చేశారు. శాసనసభ్యుల్లో 50 శాతం మంది కొత్తవారు ఉన్నారని, మంత్రివర్గంలో 17 మంది కొత్తవారు ఉన్నారని, అందరూ సహకరిస్తే ఆంధ్రప్రదేశ్‌ను నంబర్ 1గా తయారుచేస్తామని, అభివృద్ధిలో రాష్ట్రాన్ని పరుగులు పెట్టిస్తామని లోకేశ్ అన్నారు. సింగపూర్‌లో ఇంతమంది తెలుగువారు రావడం తన జీవితంలో మర్చిపోలేని రోజని, ఇక్కడున్న వారిలో రాష్ట్రాన్ని అభివృద్ధి చేయాలనే తపన కనిపిస్తోందని ఆయన ప్రశంసించారు. ఏపీఎన్ఆర్‌టీ 2.0ని ప్రారంభించామని, ఎన్ఆర్ఐలకు ఎటువంటి సమస్యలున్నా ఏపీఎన్ఆర్‌టీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. చివరగా, పహల్గాం దాడిలో వీరమరణం పొందిన మన రాష్ట్రానికి చెందిన మురళీ నాయక్‌కు నివాళులర్పించాలని మంత్రి లోకేశ్ విజ్ఞప్తి చేశారు.

# ఛత్తీస్ గఢ్ లో మరో ఎన్ కౌంటర్... నలుగురు మావోల మృతి



ఛత్తీస్‌గఢ్‌లోని బీజాపూర్ జిల్లాలో ఎన్కౌం టర్ జరిగింది. భద్రతా బలగాలు జరిపిన ఎదురుకాల్పుల్లో నలుగురు మావోయిస్టులు మృతి చెందారు. వీరిలో ఇద్దరు మహిళా మావోయిస్టులు కూడా ఉన్నారు. మృతులపై మొత్తం రూ. 17 లక్షల రివార్డు ఉంది. డిస్ట్రిక్ట్ రిజర్వ్ గార్డ్ దళాలు బాసగూడ, గంగలూర్ పోలీస్ స్టేషన్ల పరిధిలోని దక్షిణపశ్చిమ కారిడార్‌లో మావోయిస్టుల కార్యకలాపాలపై నిర్దిష్ట నిఘా సమాచారం మేరకు ఆపరేషన్ ప్రారంభించాయి. నిన్న సాయంత్రం ప్రారంభమైన కాల్పులు రాత్రంతా అడపాదడపా కొనసాగాయి. మృతి చెందిన మావోయిస్టులను హుంగా, లక్కె, భీమే, నిహాల్ అలియాస్ రాహుల్ గా గుర్తించారు. వీరంతా నిషేధిత సీపీఐ (మావోయిస్టు) సౌత్ సబ్ జోనల్ బ్యూరోకు చెందినవారని అధికారులు తెలిపారు. ఎన్‌కౌంటర్ జరిగిన ప్రదేశం నుంచి భద్రతా సిబ్బంది భారీగా ఆయుధాలు, మందుగుండు సామగ్రిని స్వాధీనం చేసుకున్నారు. వీటిలో ఒక ఎస్ఎల్ఆర్ రైఫిల్, ఒక ఇన్సాస్ రైఫిల్, ఒక .303 రైఫిల్, ఒక 12 బోర్ గన్, ఒక బీజీఎల్ లాంచర్, ఒక సింగిల్ షాట్ 315 బోర్ రైఫిల్, ఒక ఏకే47 ఉన్నాయి. అనేక మ్యాగజీన్‌లు, లైవ్ రౌండ్లు, గ్రనేడ్‌లు, బీజీఎల్ సెల్‌లు, మావోయిస్టు సాహిత్యం, నిత్యావసర వస్తువులు కూడా స్వాధీనం చేసుకున్నారు.

# ఆరు రోజుల తర్వాత ఆసుపత్రి నుంచి డిశ్చార్జి అయిన సీఎం స్టాలిన్



తమిళనాడు ముఖ్యమంత్రి, డీఎంకే అధినేత ఎంకే స్టాలిన్ ఆదివారం సాయంత్రం చెన్నైలోని అపోలో ఆసుపత్రి నుంచి డిశ్చార్జ్ అయ్యారు. ఆరు రోజుల క్రితం ఆయనకు ఒక్కసారిగా కళ్ళు తిరగడంతో ఆసుపత్రిలో చేరారు. 72 ఏళ్ల స్టాలిన్ జూలై 21 ఉదయం వాకింగ్ చేస్తుండగా అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను చెన్నైలోని థౌజండ్ లైట్స్ ప్రాంతంలోని అపోలో ఆసుపత్రికి తరలించారు. ఆసుపత్రిలో ఉన్న సమయంలోనూ ముఖ్యమంత్రి సీనియర్ అధికారులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతూ, తన ఆసుపత్రి బెడ్ నుంచే ప్రభుత్వ వ్యవహారాలను పర్యవేక్షించారు. వైద్య బృందం ప్రకారం, ప్రాథమిక పరీక్షలలో ఆయన గుండె కొట్టుకోవడంలో స్వల్ప హెచ్చుతగ్గులు గుర్తించారు. దీంతో ఆయన గుండె ఆరోగ్యాన్ని మరింత క్షుణ్ణంగా అంచనా వేయడానికి యాంజియోగ్రామ్ నిర్వహించారు. అపోలో ఆసుపత్రి విడుదల చేసిన మెడికల్ బులెటిన్‌లో, వైద్యులు స్టాలిన్ చికిత్సకు బాగా స్పందించి పూర్తిగా కోలుకున్నారని పేర్కొన్నారు.

## జస్టిస్ ఘోష్ రిపోర్టు సిద్ధం



రేపు (సోమవారం) ఉదయం ప్రభుత్వానికి తన నివేదిక అందజేసే అవకాశం ..! పారదర్శకంగా, ఎలాంటి అనుమానాలకు ఆస్కారం లేకుండా యధావిధిగా జస్టిస్ పి.సీ. ఘోష్ కమిషన్ నివేదికను సోమవారం మధ్యాహ్నాం జరిగే మంత్రివర్గ సమావేశంలో పెట్టినా ఆశ్చర్యం లేదు. ఇప్పటికే విద్యుత్ సంస్థలో అక్రమాలకు సంబంధించి జస్టిస్ మదన్ భీమ్‌రావ్ లోకూర్ కమిషన్ తన నివేదికను ప్రభుత్వానికి అందజేసిన సంగతి తెలిసిందే. ఇక వీటికి (రెండు కమిషన్ రిపోర్టులను) మంత్రివర్గం ఆమోదం తెలిపి తదుపరి చర్యలకు ఉపక్రమించే సమయం / అవకాశాలు దగ్గర్లోనే ఉన్నాయి.

## జీ.పీ.ఓ, లైసెన్స్డ్ సర్వేయర్ పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన కలెక్టర్



నిజామాబాద్, జూలై 27 (సమయం న్యూస్): గ్రామ పాలన అధికారులు (జీపీఓ), లైసెన్స్డ్ సర్వేయర్ల నియామకం కోసం నిజామాబాద్ నగరంలోని గిరిరాజ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఆకస్మికంగా తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నాం 1.00 గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 60 మంది అభ్యర్థులకు గాను, 46 మంది హాజరయ్యారని, 14 మంది గైర్హాజరు అయినట్లు కలెక్టర్ తెలిపారు. లైసెన్స్డ్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ఉదయం సెషన్ లో 10.00 గంటల నుండి మధ్యాహ్నాం 1.00 గంట వరకు జరిగిన థియరీ పరీక్షకు 305 మంది అభ్యర్థులకు గాను 271 మంది హాజరయ్యారని, 34 మంది గైర్హాజరు అయినట్లు వివరించారు. కాగా, లైసెన్స్డ్ సర్వేయర్ అభ్యర్థులకు మధ్యాహ్నాం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు సెకండ్ సెషన్ లో జరిగే ప్లాటింగ్ పరీక్షను కూడా కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. గట్టి పోలీసు బందోబస్తు నడుమ ఎలాంటి కాపీయింగ్ కు ఆస్కారం లేకుండా సజావుగా పరీక్షలు నిర్వహిస్తుండడాన్ని గమనించిన కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ కిరణ్ కుమార్, పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ రామ్మోహన్ రావు, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏ.డీ అశోక్, జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ సురేష్ కుమార్, కలెక్టరేట్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ ప్రశాంత్ తదితరులు ఉన్నారు.



## అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా పిల్లల మర్రి సైన్స్ ఫోరం ఆద్వర్యంలో ఘన నివాళులు

మహబూబ్ నగర్ జులై 27(సమయం న్యూస్) : భారతరత్న, మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం వర్ధంతి సందర్భంగా దివంగత అబ్దుల్ కలాం ఆశయాలు నెరవేర్చాలనే ఉద్దేశంతో ఏర్పాటు చేసిన పిల్లలమర్రి జిల్లా సైన్స్ ఫోరమ్ ఆధ్వర్యంలో ఆదివారం RVM హాల్ మెట్టుగడ్డ దగ్గర అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వినోద్, పద్మావతి, షంషేర్, సాయిబాబా, మంజులత, శరత్ కృష్ణ, ఆనంద్,శ్రీహరి, బషీర్ అహ్మద్, అరుణమ్మ, నేపాల్, తదితరులు పాల్గొన్నారు.

## జీ.పీ.ఓ, లైసెన్స్డ్ సర్వేయర్ పరీక్షా కేంద్రాలను పరిశీలించిన కలెక్టర్



సంగారెడ్డి జులై27(సమయం న్యూస్): గ్రామ పాలన అధికారులు (జీపీఓ), లైసెన్స్డ్ సర్వేయర్ల నియామకం కోసం సంగారెడ్డి జిల్లా కేంద్ర లోని ప్రభుత్వ తారా డిగ్రీ కళాశాలలో ఆదివారం నిర్వహించిన పరీక్షా కేంద్రాలను కలెక్టర్ పి ప్రావీణ్య పరిశీలించారు. పరీక్షల నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించారు. అభ్యర్థుల హాజరు గురించి ఆరా తీశారు. నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నాం 1.00 గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు. 77 మంది అభ్యర్థులకు గాను,62 మంది హాజరయ్యారని, 15 మంది గైర్హాజరు అయినట్లు కలెక్టర్ తెలిపారు. లైసెన్స్డ్ సర్వేయర్ల పరీక్షకు సంబంధించి ఉదయం సెషన్ లో 10.00 గంటల నుండి మధ్యాహ్నాం 1.00 గంట వరకు జరిగిన థియరీ పరీక్షకు160 మంది అభ్యర్థులకు గాను 129 మంది హాజరయ్యారని, 31 మంది గైర్హాజరు అయినట్లు తెలిపారు. లైసెన్సెడ్ సర్వేయర్ అభ్యర్థులకు మధ్యాహ్నాం 2.00 గంటల నుండి సాయంత్రం 5.00 గంటల వరకు జరిగే పరీక్షను కూడా కట్టుదిట్టంగా నిర్వహించాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తు తో పాటు ఎలాంటి కాపీ జరుగకుండా పరీక్ష ను సజావుగా నిర్వహించాలని అధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ మాధురి, డిఆర్ఓ పద్మజరాణి, జడ్పీ సీఈఓ జానకి రెడ్డి, సహాయ సంచాలకులు సర్వే ల్యాండ్ రికార్డు అధికారి ఐనేష్, ఆర్డీవో రవీందర్ రెడ్డి, పరీక్ష కేంద్రం చీఫ్ సూపర్డెంట్, అధికారులు పాల్గొన్నారు.



## చిరుత దాడిలో గాయపడి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించిన కలెక్టర్

మహబూబ్ నగర్, జులై 27(సమయం న్యూస్) : జిల్లా కోయిల్ కొండ మండలం కొత్లా బాద్ గ్రామ శివారు లో శనివారం రాత్రి చిరుత పులి దాడిలో గాయపడి ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురిని ఆదివారం జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి పరామర్శించి సంఘటన వివరాలు తెలుసుకున్నారు.గాయపడిన వారికి మెరుగైన వైద్యం అందించాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ ను కలెక్టర్ ఆదేశించారు. గొర్రెల కాపరి గొల్ల మైబన్న గ్రామానికి సమీపంలో శనివారం రాత్రి తన గొర్రెల మందను నిలిపి నిద్రించాడు. అర్థ రాత్రి మందలో అలజడి కనిపించడంతో గొర్రెల కాపరి పక్కనే ఉన్న రైతులు సత్యనారాయణ రెడ్డి, చెన్నారెడ్డి లను పిలిచాడు. అందరూ కలిసి బ్యాటరీ సహాయంతో మందలో పరిశీలించగా చిరుత పులి అప్పటికే నాలుగు గొర్రెలను చంపి వాటి రక్తాన్ని తాగి నిద్రిస్తుంది. ఈ ముగ్గురి మాటలకు చిరుత లేచి వారిపై దాడికి పాల్పడింది. ముగ్గురి కేకలతో గొర్ల అలజడికి చిరుత వెనక్కి తగ్గి గుట్టలోకి వెళ్లిపోయింది. గాయపడ్డ వారిని కుటుంబ సభ్యులు ఆసుపత్రికి తరలించారు. ఇప్పటికే చిరుత సంచరించే ప్రదేశంలో అటవీ అధికారులు బోను ను ఏర్పాటు చేసి కెమెరాలు ఏర్పాటు చేసి పర్యవేక్షిస్తున్నారు.

## వైద్య, విద్యా రంగాలకు కేంద్రం అత్యధిక ప్రాధాన్యత

- కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్
- కరీంనగర్ జిల్లా ఆసుపత్రిలో క్రిటికల్ కేర్ బ్లాక్ నూతన భవనాన్ని ప్రారంభించిన కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్



కరీం నగర్, జులై 27(సమయం న్యూస్) : కరీంనగర్ జిల్లా జనరల్ ఆసుపత్రిలో కేంద్ర నిధులతో నిర్మించిన 'క్రిటికల్ కేర్ బ్లాక్' భవనాన్ని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మానకొండూరు శాసనసభ్యులు కవ్వంపల్లి సత్యనారాయణతో కలిసి ప్రారంభించారు. ఆ భవనమంతా కలియ తిరిగి ఏర్పాట్లు పరిశీలించారు. అధికారులతో సమావేశమై మౌలిక సదుపాయల కల్పన, సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి బండి సంజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్రమోదీ విద్య, వైద్యా రంగాలకు అత్యంత ప్రాముఖ్యత ఇస్తున్నారని, అందులో భాగంగానే కరీంనగర్ జిల్లా ప్రధాన ఆసుపత్రిలో ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్ హెల్త్ ఇన్ ఫ్రాస్ట్రక్చర్ మిషన్ కింద రూ.23 కోట్ల 75 లక్షల కేంద్ర నిధులతో 'క్రిటికల్ కేర్ బ్లాక్' నూతన భవనాన్ని నిర్మించామని, మౌలిక సదుపాయాలు కల్పించామని తెలిపారు. ఈ ఆసుపత్రిలో డాక్టర్లు, సిబ్బంది నియామకం, మెయింటెన్స్ అంతా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో ఉంటుందని, వాటిని వెంటనే సమకూర్చి క్రిటికల్ కేర్ బ్లాక్ సేవలను అందుబాటులోకి తీసుకురావాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం ఆసుపత్రులకు సకాలంలో నిధులు విడుదల చేసి సేవలకు అంతరాయం లేకుండా చూడాలని అన్నారు. దేశం అభివృద్ధికి విద్య, వైద్యం చాలా ముఖ్యమని, అందుకే మోదీ ప్రభుత్వం ఈ రంగాలకు అత్యంత ప్రాముఖ్యనిస్తోందని అన్నారు. యూపీఏ హయాంలో (2014 15 బడ్జెట్‌లో) విద్యా రంగానికి కేంద్రం 68 వేల 728 కోట్లు కేటాయిస్తే... ఈ ఒక్క ఏడాదే (2025 26) మోదీ సర్కార్ 1 లక్షా 28 వేల 650 కోట్ల రూపాయలు కేటాయించిందని అన్నారు. అంటే దాదాపు విద్యా బడ్జెట్ ను డబుల్ చేశారని అన్నారు. వైద్య రంగానికి UPA యుగంలో 2013 14లో కేంద్ర ఆరోగ్య బడ్జెట్ 37 వేల కోట్ల రూపాయలు మాత్రమేనని, కానీ మోదీ ప్రభుత్వం ఈ బడ్జెట్ లో (2025 26) వైద్య రంగానికి కేటాయించిన బడ్జెట్ 1 లక్షా 35 వేల కోట్ల రూపాయలని అన్నారు. మోదీ ప్రభుత్వానికి పేదలపట్ల, వారి ఆరోగ్యంపట్ల ఉన్న శ్రద్ధకు నిదర్శనమే ఈ బడ్జెట్ కేటాయింపు అని తెలిపారు. కేంద్రం ఆయుష్మాన్ భారత్ వంటి విప్లవాత్మకమైన పథకాలు తీసుకొచ్చాక ప్రజలపై భారం చాలా తగ్గిందని, నూటికి 39 రూపాయల 40 పైసలు మాత్రమే భారం పడుతోందని అన్నారు. ఆయుష్మాన్ భారత్ కార్డులున్న వారికైతే 5 లక్షల వరకు ఉచితంగా వైద్యం అందుతోందని తెలిపారు. వైద్య రంగంలో తీసుకువచ్చిన అభివృద్ధి, విప్లవాత్మక మార్పులు కూడా చాలా ఉన్నాయని, గత 11 ఏళ్లలో AIIMS (ఆలిండియా ఇన్స్టిట్యూట్స్ ఆఫ్ మెడికల్ సైన్సెస్) సంఖ్య 30కి పెరిగాయని అన్నారు. గత ప్రభుత్వాల పాలన నాటికి దేశవ్యాప్తంగా 7 మాత్రమే ఉండేవని, మోదీ పాలనలో 30కి పెరిగాయని అన్నారు. 2014 లో 387 ప్రభుత్వ మెడికల్ కాలేజ్‌లు మాత్రమే ఉంటే...నేడు వాటిని రెట్టింపు (780) చేశారని, ఎంబీబీఎస్ సీట్లు గతంలో 51 వేలు మాత్రమే ఉండేవని, మోదీ వచ్చాక మెడికల్ సీట్ల సంఖ్యను 1 లక్షా 18 వేలకు పెంచారని అన్నారు. గతంలో 31 వేల PG సీట్లు మాత్రమే ఉంటే నేడు 74 వేలకుపైగా సీట్లు అందుబాటులోకి తీసుకొచ్చారని వివరించారు. ఈ కార్యక్రమంలో మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, ఆర్డీవో మహేశ్వర్, జి జి హెచ్ సూపరింటెండెంట్ వీరారెడ్డి, డి ఎం హెచ్ ఓ వెంకటరమణ పాల్గొన్నారు.



## గ్రామ పాలన అధికారి పరీక్షా కేంద్ర్రాన్ని తనిఖీ చేసిన జిల్లా పాలనాధికారి రాజర్షి షా

ఆదిలాబాద్, జులై27 (సమయం న్యూస్): గ్రామ పాలన అధికారుల నియామకం కోసం నిర్వహిస్తున్న పరీక్షలకు సంబంధించి ఆదివారం జిల్లా కేంద్రం లోని నలంద కాలేజీలో ఏర్పాటు చేసిన గ్రామపాలన అధికారుల నియామక పరీక్ష కేంద్రాన్ని కలెక్టర్ తనిఖీ చేశారు. పరీక్షల నిర్వహణ తీరును పరిశీలించి, అభ్యర్థుల హాజరు వివరాలు అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా, పరీక్షలను పకడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ సూచించారు. ఉదయం 10.00 గంటల నుండి మధ్యాహ్నాం 1.00 గంట వరకు కొనసాగిన గ్రామ పాలన అధికారి పరీక్షకు 51 మంది అభ్యర్థులకు గాను 48 మంది హాజరయ్యారని, ముగ్గురు గైర్హాజరు అయినట్లు తెలిపారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్ డి ఓ స్రవంతి, mro శ్రీనివాస్, డి టి ఇస్తార్ , పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ , ప్రిన్సిపల్ , తదితరులు ఉన్నారు.

## ఘనంగా జీవన జ్యోతిర్లింగాలయ గడప ప్రతిష్ట





పటాన్ చెరు(జిన్నారం), జూలై 27, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా మండల కేంద్రమైన జిన్నారంలో నూతనంగా నిర్మిస్తున్న వినాయక, భ్రమరాంబ సమేత శివాలయం గర్భాలయాల గడప స్థాపిత కార్యక్రమం ఆదివారం ఘనంగా ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిన్నారం మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ కుటుంబ సమేతంగా హాజరయ్యారు. ఆలయ కమిటీ సభ్యులతో కలిసి రవీందర్ గౌడ్, రాజశ్రీ దంపతులు గర్భాలయాల గడపలకు వేద పండితులతో మంత్రోచ్చారణ మధ్య పూజా కార్యక్రమాలు నిర్వహించి స్థాపితం చేయడం జరిగింది.మాజీ ఎంపీపీ రవీందర్ గౌడ్ ఆలయంలోని గర్భగుడిలో ముఖద్వరాలను బహుకరించడం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండల కేంద్రంలో నూతనంగా నిర్మిస్తున్న శివాలయం రాబోయే రోజుల్లో మహా అద్భుతమైన దేవాలయంగా ప్రసిద్ధి చెందుతుందని ఆయన అన్నారు. మంచి ఆహ్లాదకరమైన వాతావరణంలో ఈ దేవాలయ నిర్మాణం జరగడం చాలా ఆనందంగా ఉందని అన్నారు.ఈ కార్యక్రమంలో పాలుపంచుకోవడం మా దంపతులకు పూర్వజన్మ సుకృతమని ఆయన అన్నారు. రాబోయే రోజుల్లో శ్రీ జీవనజ్యోతి జ్యోతిర్లింగాలయానికి తన వంతు సహాయ సహకారాలు ఎల్లవేళలా ఉంటాయని ఆయన తెలిపారు. మండల కేంద్రంలో మంచి పుణ్యక్షేత్రం గా వెలిసి ప్రజల కోరికలు నెరవేరుస్తూ ప్రజలందరినీ సుఖసంతోషాలతో చల్లగా చూడాలని వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ మహిళలు, యువకులు, ప్రజలు, పెద్దఎత్తున పాల్గొన్నారు.

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక · తెలుగు దినపత్రిక



# భారీ వర్షాలు వలన ప్రజలు ఎవ్వరు కూడా చెరువులు, ప్రాజెక్టు ల వద్దకు వెళ్ళవద్దు

* జిల్లా అదనపు కలెక్టర్ నగేష్

మెదక్ జులై27(సమయం న్యూస్) : భారీ వర్షా ల వలన ప్రజలు ఎవ్వరు కూడా ప్రాజెక్టులు, చెరువుల దగ్గర కు వెళ్ళరాదని అదనపు కలెక్టర్ నగేష్ సూచించారు. ఆదివారం హవేలీగాన్ పూర్ మండలం దూప్ సింగ్ తండా భారీ నీటి ప్రవాహం కారణంగా వాగు పొంగి పొర్లుతుంది.. రెవిన్యూ సిబ్బందితో కలిసి అదనపు కలెక్టర్ పరిశీలించారు వరద ఉధృతి ఉన్న దగ్గర హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేయాలని, భారీ వర్షాలు వరదల వలన ప్రజలు చెరువులు దగ్గరకు వెళ్ళరాదని వరద పరిస్థితిని నిశితంగా పరిశీలించాలని, ఏదైనా అవాంఛనీయ సంఘటన జరిగితే వెంటనే నివేదించాలని ప్రజలను ఎవరు కూడా అటువైపు వెళ్ళకుండా చూడాలన్నారు.ప్రస్తుతం దూప్ సింగ్ తండాకు చేరుకోవడానికి ప్రత్యామ్నాయ మార్గాన్ని గురించి అధికారులు అడిగి తెలుసుకున్నారు.







## ప్రజలు చెరువులు ప్రాజెక్టుల వద్ద కు వెళ్ళవద్దు

* జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

వికారాబాద్ జులై27(సమయం న్యూస్) : భారీ వర్షా ల వలన ప్రజలు ఎవ్వరు కూడా ప్రాజెక్టులు, చెరువుల దగ్గర కు వెళ్ళరాదని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ సూచించారు. ఆదివారం వికారాబాద్ జిల్లా సర్పాన్ పల్లి ప్రాజెక్టు ను జిల్లా కలెక్టర్ ఇరిగేషన్ అధికారులతో కలిసి పరిశీలించారు.. ప్రాజెక్టు యొక్క నీటి మట్టం, ఎన్ని ఫీట్ల లోతు ఉందని పూర్తి వివరాలు అడుగగా 0.25 కేపాసిటీ ఉందని, ప్రస్తుతం 0.18 కేపాసిటీ ఉందని, రెండు ఫీట్ల నీటి మట్టము పెరిగితే ప్రాజెక్టు నిండుతుందని తెలిపారు. ఎక్కడైనా లీకేజీ లు ఉన్నాయా, క్రింది భాగం వాటర్ ఫ్లో ఉండేలా చూడాలని అధికారులకు ఆదేశించారు.చుట్టూ పక్క గ్రామాల వారు ప్రాజెక్టు సమీ పంలోకి రాకుండా జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. కలెక్టర్ గారితో పాటు ఇరిగేషన్ ఇ ఇ మధు సుధన్ రెడ్డి, నరేందర్, ఉన్నారు.

# ఇందిరమ్మ ఇండ్లు చారిత్రాత్మక పథకం..

* రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదు.రైతులకు సరిపడా యూరియా అందించే బాధ్యత ప్రభుత్వానిది...
* ప్రజల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం..
* ఉమ్మడి జిల్లా అధికారులతో సమీక్షా సమావేశంలో ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క..



భద్రాద్రి కొత్తగూడెం జులై 27(సమయం న్యూస్) : ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లో అమలవుతున్న ప్రభుత్వ పథ కాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతిపై పాల్వంచలోని ఐడిఓసి సమావేశ మందిరంలో ఆదివారం సమీక్షా సమావేశం నిర్వ హించబడింది. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్‌చార్జి మంత్రి వాకాటి శ్రీహరి, రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ మరియు చేనేత శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రెవెన్యూ, గృహనిర్మాణ, సమాచార మరియు పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. సమీక్షలో జిల్లాల్లో వర్షాభావం, వరద ముంపు, సీజనల్ వ్యాధులు, ఎరువుల సరఫరా, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం, రేషన్ కార్డుల పంపిణీ, వనమహోత్సవ కార్యక్రమం, విద్యా రంగ అభివృద్ధి తదితర అంశాలపై సమగ్రంగా చర్చించబడింది. భద్రాద్రి కొత్తగూడెం కలెక్టర్ జితేష్ వి. పాటిల్, ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దుర్శెట్టి పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా మంత్రులకు జిల్లాల ప్రస్తుత పరిస్థితులపై వివరాలు ఇచ్చారు. ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ.. భారీ వర్షాలు, వరదలను ఎదుర్కొనేందుకు యాక్షన్ ప్లాన్ తో అధికారులు సిద్ధంగా ఉండాలన్నారు.ఇందిరా సౌర జలవికాసం పథకం కింద ఈ రైతులకు సోలార్ పంపులు, డ్రిప్, స్ప్రింక్లర్లు, ఉద్యానపంటల సాగుకు ఉచితంగా సౌకర్యాలు కల్పిస్తామని చెప్పారు. మూడు సంవత్సరాల్లో రూ.12,600 కోట్లు ఖర్చు చేసే ఈ పథకం ద్వారా గిరిజన రైతుల అభివృద్ధి జరుగుతుందన్నారు. ప్రతి జిల్లాలో మహిళా సంఘాల ద్వారా చేపల పెంపకాన్ని ప్రోత్సహించేందుకు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు.యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు 25 ఎకరాల స్థలంలో నిర్మించాలని, ఈ పాఠశాలలు ఇతర విద్యా సంస్థలకు ఆదర్శంగా ఉండేలా అభివృద్ధి చేయాలన్నారు. విద్యార్థుల ఆరోగ్యంపై వర్షాకాలంలో ప్రత్యేక దృష్టి అవసరమని, వైద్య పరీక్షలు నిరంతరం నిర్వహించాలని సూచించారు. జిల్లా వ్యాప్తంగా పేదల సంక్షేమానికి, పేదలను ఆర్థికంగా అభివృద్ధి పరచడానికే మహాలక్ష్మి పథకం, 500 కే గ్యాస్ బండ, 200 యూనిట్ల ఉచిత విద్యుత్, మహాలక్ష్మి పథకం కింద ఇప్పటివరకు 200 కోట్ల ఉచిత ప్రయాణాలు మహిళలు చేశారన్నారు . భారతదేశ చరిత్రలోనే ఎన్నడూ లేని విధంగా ఐదు లక్షల రూపాయలతో ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి, ప్రతి నియోజకవర్గానికి 3500 ఇండ్లు మంజూరు చేశామన్నారు. దీనికిగాను ప్రతి సోమవారం వారం నిధులు విడుదల చేస్తున్నామన్నారు. మహిళలను వ్యాపారవేత్తలుగా చేయ డానికి గాను బ్యాంకు లింకేజీ ద్వారా లక్ష కోట్ల రూపాయలు రుణాలు మంజూరు చేసే లక్ష్యంతో ప్రభుత్వం ముందుకు సాగుతుందన్నారు. చేపపిల్లల పంపిణిలో ఈ సంవత్సరం ప్రయోగాత్మకంగా మహిళా సంఘాల ద్వారా చేప పిల్లల ఉత్పత్తి కేంద్రాలు స్థాపించడం ద్వారా వారిని అభివృద్ధి చెందే విధంగా చర్యలు చేపట్టామన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా ఇన్చార్జి మంత్రి వాకాటి శ్రీహరి మాట్లాడుతూ.. ప్రభుత్వ పథకాలను ప్రజలకు చేరేలా అధి కారులు, ప్రజాప్రతినిధులు కలసి పని చేయాలని అన్నారు. వర్షాకాలంలో అప్రమత్తంగా ఉండాలని, రైతుల సమస్యలపై ప్రభుత్వం తగిన చర్యలు తీసుకుంటుందని, యూరియా తక్కువ ఉన్నట్టు తప్పుడు ప్రచారాలను ప్రజలు నమ్మవద్దని పేర్కొన్నారు. యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ పాఠశాలలు విద్యాభివృద్ధికి మలుపుతిప్పే కార్యక్రమ మని అభివర్ణించారు. ఆగస్టు రెండో వారంలో చేప పిల్లల పంపిణీ కార్యక్రమం చేపడతామన్నారు. గత ప్రభుత్వం కంటే ఎక్కువ జాగ్రత్తలు పాటిస్తూ ప్రస్తుతం110 MM చేప పిల్లలు పంపిణీ చేయడంతోపాటుగా,కౌంటింగ్ ప్రకారం అందజేయడం జరుగుతుందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న చెరువు గట్ల పైన చెరువు సామర్థ్యం, ఎన్ని చేప పిల్లలు పెంపకం చేపడుతున్నాం, వాటి యొక్క ఉత్పత్తి ఎక్కడ నుంచి మరియు వాటి ఖర్చు తదితర పూర్తి వివరాలు సంబంధించిన బోర్డులు ఏర్పాటు చేయడం జరుగు తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల మంజూరు తో పాటు ప్రతి ఒక్క ఇంటి ఆవరణంలో ఐదు మొక్కలను నాటే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు మాట్లాడుతూ.. రాష్ట్రంలోని ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధి మోడల్‌గా తీర్చిదిద్దే లక్ష్యంతో అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. గత పాలనలో అభివృద్ధి కార్యక్రమాలు లేవన్న ఆయన, ఈ ప్రభుత్వం రైతులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా యూరియా సరఫరా చేయడంపై కట్టుబడి ఉందన్నారు. వరదలు, వర్షాలకు సంబంధించి అన్ని ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. జిల్లాలో సరిపడినంత యూరియా అందుబాటులో ఉందని, రైతులు ఆందోళన చెందవలసిన అవ సరం లేదన్నారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ.. అధికారులు ప్రజా సంక్షేమ ప్రభుత్వ లక్ష్యాన్ని ముందుంచుకొని పనిచేయాలని అన్నారు. వన మహోత్సవంలో భాగంగా నాటిన ప్రతి మొక్క సంరక్షణ చేపట్టాలన్నారు. రెవెన్యూ శాఖలో చట్టవ్యతిరేక కార్యకలాపాలు జరిపే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆగస్టు 15 నాటికి డబుల్ బెడ్ రూమ్ ఇండ్ల లబ్ధిదారుల ఎంపిక పూర్తి చేసుకుని పంపిణీ చేయు విధంగా అన్ని చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆగస్టు నెలలో శ్రావణమాసం సందర్భంగా ఇందిరమ్మ ఇండ్ల గృహప్రవేశాలు జరిగేటట్లు తగిన చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి అవసరమైన ఇసుకను సరఫరా చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఎదురైనా ప్రతివారం ఇందిరమ్మ ఇండ్లకు నిధులు మంజూరు చేస్తుందన్నారు. ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా తీసుకొని పేదవారి సంక్షేమం కోసం రూపొందించిన పథకం అన్నారు. దీనిని ప్రజల్లోకి తీసుకోవలసిన బాధ్యత స్థానిక ప్రజాప్రతినిధుల పైన ఉందన్నారు. పంచాయతీరాజ్ మరియు ఆర్ అండ్ బి శాఖ పరిధిలోని పెండింగ్ లో ఉన్న అన్ని పనులను త్వరితగతను పూర్తి చేయాలన్నారు. రహదారుల వెంట ఏర్పడిన గుంటలను పూడ్చాలని ఈ సందర్భంగా అధికారులను ఆదేశించారు. వర్షాకాలం నీరు కలుషితమయ్యే అవకాశం ఉందని, అలా జరగకుండా అన్ని చర్యలు చేపట్టా లని అధికారులను ఆదేశించారు. ప్రజలకు అసౌకర్యం కలగకుండా అధికారులు అన్ని జాగ్రత్తలు. తీసు కోవాలన్నారు.ఆస్పత్రులు, వసతి గృహాలు పర్యవేక్షించడానికి ప్రతి నియోజకవర్గానికి ఒక ప్రత్యేక అధి కారిని నియమించి, ప్రతి నెల ఒక ప్రణాళిక ద్వారా ఆసుపత్రులు వసతి గృహాలు పరిశీలించి నివేదికలు అందచేయాలని ఆదేశించారు. ఈ సమీక్ష సమావేశంలో ఉమ్మడి జిల్లా ప్రత్యేక అధికారి సురేంద్రమోహన్ ఐఏఎస్, ఎస్పి రోహిత్ రాజు, ఖమ్మం పార్లమెంట్ సభ్యులు రామసహాయం రఘురామ రెడ్డి, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు పోరిక బలరాం నాయక్, కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు, పినపాక శాసనసభ్యులు పాయం వెంకటేశ్వర్లు, భద్రాచలం శాసనసభ్యులు తెల్లం వెంకట్రావు, ఇల్లందు శాసనసభ్యులు కోరం కనకయ్య, అశ్వరావుపేట శాసనసభ్యులు జారే ఆదినారాయణ, వైరా శాసనసభ్యులు రామదాసు నాయక్, సత్తుపల్లి శాసనసభ్యులు మట్టా రాగమయి, అటవీ శాఖ అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ వీరయ్య, టి జి ఐ డి సి చైర్మన్ మువ్వ విజయ్ బాబు, జిల్లా అధికారులు మరియు తదితరులు పాల్గొన్నారు.



సత్యసాయి గార్డెన్లో బజ్జూరి వైకుంఠం కుమార్తె శ్రియ బోయుడి ప్రసాద్ గారి కుమారుడు నిఖిల్ గార్ల నిశ్చితార్థంలో పాల్గొని శుభాకాంక్షలు తెలియజేసిన గ్రేటర్ వరంగల్ కాంగ్రెస్ వర్కింగ్ ప్రెసిడెంట్ రాజనాల శ్రీహరి..

*- వరంగల్, సమయం న్యూస్:*



పర్వతగిరి వెలుగు రిపోర్టర్ కుమార్తె శ్రీజ అల్లుడు రోహిత్ లను గాయత్రి గార్డెన్ లోనే ఎంగేజ్మెంట్ ఫంక్షన్ నందు ఆశీర్వదించిన మాజీ జడ్పిటిసి మేడిశెట్టి రాములు గోనె సంపత్ కంటే ఏకాంతం తదితరులు

*- వరంగల్, సమయం న్యూస్*



ఈ రోజు వరంగల్ జిల్లా పర్యటన భాగంగా వంగపాడు క్రాస్ వద్ద బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీ కల్వకుంట్ల తారక రామ రావు గారికి గజమాలతో ఘన స్వాగతం పలికిన వరంగల్ తూర్పు మాజీ శాసనసభ్యులు శ్రీ నన్నపునేని నరేందర్ గారు మరియు వరంగల్ తూర్పు 24 డివిజన్ బి ఆర్ఎస్ పార్టీ శ్రేణులు మరియు కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు

*- వరంగల్, సమయం న్యూస్*

# పర్యావరణపరంగా ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలి

- సత్య సాయి సేవ సమితి ఆధ్వర్యంలో మొక్కలునాటే కార్యక్రమంలో
- పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్



పటాన్ చెరు చెరు జూలై 27, సమయం న్యూస్ : పర్యావరణపరంగా మారుతున్న తీవ్ర పరిణామాలను దృష్టిలో పెట్టుకొని ప్రతి ఒక్కరు బాధ్యతగా మొక్కలు నాటాలని పటాన్ చెరు కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ అన్నారు. సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు డివిజన్ పరిధిలోని ప్రభుత్వ బాలుర పాఠశాలలో శ్రీ సత్యసాయి సేవా సమితి వారి ఆధ్వర్యంలో మొక్కలు నాటే కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ వారితో కలిసి మొక్కలు నాటే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ గతంలో మన పెద్దలు నాటిన మొక్కలు మనకు ఫలాలను ఇస్తున్నాయని, నేడు మనం నాటే మొక్కలు మన ముందు తరాలకు బాగుంటాయని అన్నారు. పెరుగుతున్న కాలుష్యాన్ని తగ్గించేందుకు మొక్కలు పెంచాలని ఆయన సూచించారు. ప్రస్తుత పరిస్థితులలో తగినన్ని మొక్కలు లేకపోవడం వల్ల భూతాపం పెరిగి వర్షాలు సరైన సమయంలో పడడం లేదని ఆయన అన్నారు. పర్యావరణపరంగా మారుతున్న తీవ్ర పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని ప్రతి ఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెరు బిఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ నాగరాజు యాదవ్, శాంతినగర్, శ్రీనగర్ కాలనీ ప్రెసిడెంట్ అంజిరెడ్డి, ఆల్విన్ కాలనీ ప్రెసిడెంట్ సత్యనారాయణ, కిష్టయ్య, రాజు, అస్మత్ అజ్జు, అఫ్జల్, తదితరులు పాల్గొన్నారు.

# అర్హులందరికి రేషన్ కార్డులు...

* జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్
* పేదవారి ఆత్మ గౌరవం రేషన్ కార్డులు.....
* రేషన్ కార్డుల జారీ నిరంతర ప్రక్రియ....
* తెలంగాణ రాష్ట్ర పర్యాటక సంస్థ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి
* పేదవారికి రేషన్ కార్డులు ఇవ్వటం అభినందనీయం...
* ఆర్ ఎన్ ఆర్ ధాన్యం సేకరించి నాణ్యమైన సన్న బియ్యం పంపిణీ చేయాలి...
* సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీశ్ రెడ్డి

సూర్యాపేట జూలై 27(సమయం న్యూస్) : రాష్ట్ర వ్యాప్తంగా హుజూర్నగర్ నుండి సన్నబియ్యం పంపిణీ, తిరుమలగిరి నుండి నూతన్ రేషన్ కార్డులు పంపిణీ చేయటం మన జిల్లా అదృష్టం అని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అన్నారు. ఆదివారం కలెక్టరేట్ కార్యాలయ సమావేశం మందిరంలో సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి, తెలంగాణ పర్యాటక సంస్థ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి లతో కలిసి జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ సూర్యాపేట మండలంకి చెందిన వారికి నూతన రేషన్ కార్డులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా



కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఇప్పటి వరకు 32274 నూతన రేషన్ కార్డులు మంజూరు చేయటం ద్వారా కొత్తగా 95309 మందికి సన్నబియ్యం పొందే హక్కు లభించిందని అలాగే ఈరోజు సూర్యాపేట మండలంలో 4016 నూతన కార్డుల ద్వారా 12193 మందికి సన్నబియ్యం పంపిణీ అర్హత లభించిందని, అలాగే ఇప్పటికే ఉన్న 8008 కార్డులలో 11930 అదనంగా చేర్చి మందికి కొత్తగా అవకాశం కల్పించటం జరిగిందని అన్నారు. రేషన్ కార్డులు రాని వారు ఎవరు ఆందోళన పడాల్సిన అవసరం లేదని కొత్త కార్డు కొరకు మీ సేవ ద్వారా ధరఖాస్తు చేసుకోవాలని తదుపరి అర్హత ఉంటే తహసీల్దార్ పరిశీలించి పౌర సరఫరాల శాఖ ద్వారా కార్డు మంజూరు చేస్తారని తెలిపారు. రేషన్ డీలర్లు పేదవారికి సన్నబియ్యం పంపిణీలో కీలక పాత్ర పోషించాలని అన్నారు. తెలంగాణ పర్యాటక సంస్థ కార్పొరేషన్ చైర్మన్ పటేల్ రమేష్ రెడ్డి మాట్లాడుతూ పేదవారి ఆత్మ గౌరవనికి రేషన్ కార్డులు చిహ్నం అని మన జిల్లా నుండే సన్నబియ్యం పంపిణీ, నూతన్ రేషన్ కార్డులు మంజూరు చేసినందుకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి కి ధన్యవాదములు తెలుపుతూ దేశంలోని ఎ నాయకుడికి రాని ఆలోచన ధనవంతులతో పాటు పేదవారు సన్న బియ్యం తినాలని మన ముఖ్యమంత్రికి,మంత్రికి రావటం వారి గొప్పతనం అని కొనియాడినారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ఇల్లు ఇవ్వాలని గతంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉన్నప్పుడు 20 లక్షల ఇల్లులు నిర్మించారాని మరల ఇప్పుడు నియోజవర్గానికి 3500 చొప్పున మొత్తం ఐదు సంవత్సరాలలో 20 లక్షల ఇల్లులు నిర్మిస్తున్నామని తెలిపారు. సూర్యాపేట శాసన సభ్యులు గుంటకండ్ల జగదీష్ రెడ్డి మాట్లాడుతూ అర్హత కలిగిన వారందరికీ నూతన రేషన్ కార్డులు ఇవ్వటం అలాగే సన్నబియ్యం ఇవ్వటం చాలా సంతోషం అని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో రేషన్ కార్డులు లో ఎంతమంది ఉన్న నలుగురి కి మాత్రమే 4 కేజీ ల చొప్పున ఇచ్చారని తెలంగాణ ఏర్పడిన తర్వాత కార్డులో ఉన్న అందరికి 6 కేజీ ల చొప్పున ఇచ్చామని తెలిపారు.రాజేంద్రనగర్ లోని వ్యవసాయ యూనివర్సిటీ ద్వారా తయారు చేసిన ఆర్ ఎన్ ఆర్ ధాన్యం సేకరించి నాణ్యమైన సన్నబియ్యం పంపిణీ చేయాలని సూచించారు.ఎన్నికల ముందు ఇచ్చిన వాగ్దానాల మేరకు ప్రభుత్వం ఏర్పాటు చేసాక అన్ని అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమం లో అదనపు కలెక్టర్ పి రాంబాబు,ఆర్డీఓ వేణుమాధవరావు,గ్రంధాలయ సంస్థల చైర్మన్ రామారావు, మార్కెట్ కమిటీ చైర్మన్ కొప్పుల వేణారెడ్డి, వైస్ చైర్మన్ గట్టు శ్రీనివాస్,డి ఎస్ ఓ మోహన్ బాబు,తహసీల్దార్ కృష్ణయ్య,అధికారులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## కుత్బుల్లాపూర్ అభివృద్ధి ప్రదాత, బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారికీ ఆత్మీయ ఆహ్వానం..

కుత్బుల్లాపుర్, సమయం న్యూస్ జూలై 27 : ఈరోజు పేట్ బషీరాబాద్ లోని ఎమ్మెల్యే గారి క్యాంప్ కార్యాలయంలో కుత్బుల్లాపూర్ నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, సంక్షేమ సంఘాల సభ్యులు మహిళా నాయకురాలు బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ గారిని మర్యాదపూర్వకంగా కలిసి పలు ఆహ్వానాలు వినతి పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా బిఆర్ఎస్ పార్టీ విప్, ఎమ్మెల్యే కెపి. వివేకానంద్ గారు మాట్లాడుతూ.... కుత్బుల్లాపూర్ నియోజకవర్గ అభివృద్ధి, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తున్నామని అన్నారు.

# విలువలతో కూడిన జర్నలిజం మాత్రమే చేయాలి

: తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి

వరంగల్:జూలై27(సమయం న్యూస్): పాత్రికేయులు సామాజిక బాధ్యతతో విలువలతో కూడిన జర్నలిజాన్ని మాత్రమే చేయాలని తద్వార సమాజంలో ప్రజల ఆదరణ పొందుతామని తెలంగాణ రాష్ట్ర మీడియా అకాడమీ చైర్మన్ శ్రీనివాసరెడ్డి అన్నారు. వరంగల్ పట్టణంలోని ఉర్స్ కరీమాబాద్ తాళ్ల పద్మావతి ఇంటర్నేషనల్ స్కూల్లో తెలంగాణ మీడియా అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం వరంగల్ జిల్లా ప్రింట్ ఎలక్ట్రానిక్ మీడియా జర్నలిస్టులకు రెండు రోజులపాటు నిర్వహిస్తున్న శిక్షణ తరగతుల కార్యక్రమానికి శ్రీనివాస్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసరెడ్డి "నైతిక నియమాలు మీడియా చట్టాలు" అనే అంశంపై మాట్లాడుతూ మీడియా అకాడమీ నిర్వహిస్తున్న పాత్రికేయుల శిక్షణ తరగతుల వల్ల మరింత జ్ఞానాన్ని పెంచుకునే అవకాశం ఉంటుందని అన్నారు.వార్తల సేకరణలో సామాజిక ప్రభావం వంటి అంశాలు పూర్తిగా కొత్త రూపం దాల్చాయని తెలిపారు.




ప్రస్తుతం డిజిటల్ మీడియా రంగంలో వేగంగా వార్తల సేకరణ సులభం అవుతుందని అన్నారు. మారుతున్న కాలానికి అనుగుణంగా జర్నలిస్టులకు కావలసిన శిక్షణ ఇవ్వడానికి మీడియా అకాడమీ అన్ని చర్యలను చేపట్టి శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నామన్నారు. పాత్రికేయులు నైతిక విలువలు కాపాడుకోవడంతోపాటు పారదర్శకతతో కూడిన వార్త లను ప్రచూరించినప్పుడే ప్రజల్లో పాత్రికేయులపై గౌరవం పెరుగుతుంద న్నారు. జర్నలిస్టులు నైతిక ప్రమాణాలు పాటించాలని అన్నారు. ప్రెస్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా ఆవిర్భావం, వర్కింగ్ జర్నలిస్ట్..నాన్ వర్కింగ్ జర్నలిస్ట తదితర అంశాలపై ఆయన విపులంగా తెలియజేశారు. భవిష్యత్తులో పత్రిక నిర్వహణలో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రధాన పాత్ర పోషించబోతుందని, తదనుగుణంగా రాబోవు కాలంలో జర్నలిస్టులకు టెక్నాలజీ, ఫ్యాక్ట్ చెక్ వంటి టెక్నికల్ అంశాలతో కూడిన తరగతులను మీడియా అకాడమీ తరపున నిర్వహిస్తామని అన్నారు.ప్రముఖ సంపాదకులు కే శ్రీనివాస్ మాట్లాడుతూ తెలంగాణ జర్నలిజం గతం, వర్తమానం, భవిష్యత్తు మీడియా , ధోరణులు ఆధునిక యుగంలో మీడియాలో వస్తున్న మార్పుల గురించి వివరించారు. సోషల్ మీడియా యూ ట్యూబ్ లో వస్తున్న వార్తలు క్షణాల్లో ప్రజల్లో వెళ్తున్నాయని తెలిపారు. సీనియర్ జర్నలిస్ట్, బ్యూరో ఆఫ్ నెట్వర్క్ వెలుగు ఇంచార్జ్ చిల్ల మల్లేశం భాష, తప్పొప్పులు, దిద్దుబాట్లపై జర్నలిస్టులకు కూలంకషంగా వివరించారు.ఆయా రిపోర్టర్లు వార్తలను డెస్క్ కు పంపించే సమయంలో వాడుక భాషలో మాత్రమే వార్తలను పంపాలని, అవసరంలేని సాహిత్య పదజాలం, అర్థం కాని తెలుగు పదాలను వార్తలలో ఉపయోగించకూడదని అన్నారు. సీనియర్ జర్నలిస్ట్ దిలీప్ రెడ్డి సమాచార హక్కు చట్టం 2005 గురించి సమగ్రంగా వివరించి జర్నలిస్టుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ కార్యక్రమం లో మీడియా అకాడమీ కార్యదర్శి వెంకటేశ్వర రావు, మేనేజర్ శైలేష్ రెడ్డి, టియుడబ్ల్యూజే (ఐజెయు) అధ్యక్షులు శ్రీ రామ్ రామ్ చందర్ ప్రధాన కార్యదర్శి మట్టదుర్గా ప్రసాద్ తాళ్ళ పద్మావతి విద్యాసంస్థల డైరెక్టర్ డా.వరుణ్,డిపిఆర్ఓ ఆయుబ్ అలీ, పాత్రికేయులు తదితరులు పాల్గొన్నారు.



## బాధిత కుటుంబాలకు అండగా ఉంటా

- ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి

రాయపోల్,జూలై27;(ఆంధ్ర ప్రభ) బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ వారికి అండగా ఉంటామని దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి అన్నారు. మండల కేంద్రం రాయపోల్ లో బిఆర్ఎస్ పార్టీ నాయకులు గల్వ జీవన్ రెడ్డి తమ్ముడు సత్తిరెడ్డి వారం రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు.అలాగే బిఆర్ఎస్ పార్టీ నాయకులు సాకలి పరశురాములు తల్లి ఇటీవల మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్ రెడ్డి ఆదివారం ఎస్సీ,ఎస్టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య తో కలిసి బాదిత కుటుంబాలను పరామర్శించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. పార్టీ నాయకులకు,కార్యకర్తలకు ఎలాంటి కష్టం వచ్చిన వారికి అందుబాటులో ఉంటూ అన్ని విధాలుగా ఆదుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ పార్టీ నాయకులు సోలిపేట సతీష్ రెడ్డి,రణం శ్రీనివాస్ గౌడ్, మండల పార్టీ అధ్యక్షులు వెంకటేశ్వర శర్మ,మాజీ జెడ్పిటిసి యాదగిరి,మండల ఉపాధ్యక్షులు వెంకట్ గౌడ్, పార్టీ నాయకులు ఇప్ప దయాకర్, మాసాన్ పల్లి రాజు తదితరులు పాల్గొన్నారు.



## భవిష్యత్ విజయం కోసం విద్యార్థులు తీసుకున్న ప్రేరణాత్మక అడుగు

జులై 27 (సమయం న్యూస్) : దిల్సుఖ్ నగర్‌లోని శ్రీ పొట్టి శ్రీరాములు ప్రభుత్వ హైస్కూల్‌లో 60 మంది విద్యార్థులు పాల్గొన్న ప్రత్యేక అవగాహన సెషన్ విజయవంతంగా నిర్వహించబడింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులకు స్టడీ స్కిల్స్, మెమరీ టెక్నిక్స్, రివిజన్ పద్ధతులు, ఇన్‌క్లాస్ లెసన్స్, మంచి అలవాట్లు, సమయ నిర్వహణ, మరియు గోల్ సెట్టింగ్ అంశాలపై విశదీకరణ ఇచ్చారు. హెడ్‌మాస్టర్ శ్రీమతి శారద గారి నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో ప్రముఖ ఇంపాక్ట్ సర్టిఫికేట్ ట్రైనర్ మరియు మోటివేషనల్ స్పీకర్ శ్రీ వెంకట రాజు (95వ బ్యాచ్) ముఖ్య వక్తగా పాల్గొని తన అనుభవాన్ని విద్యార్థులకు పంచుకున్నారు. ఈ ప్రత్యేక కార్యక్రమం విద్యార్థుల్లో సానుకూల స్వభావాన్ని, నైపుణ్యాలను, మరియు ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడంతో పాటు వారి విద్యా ప్రయాణంలో ముందడుగు వేసేలా ప్రోత్సహించింది. విద్యార్థులు ఈ సెషన్ ద్వారా విలువైన జ్ఞానాన్ని, కొత్త మార్గదర్శకత్వాన్ని సొంతం చేసుకున్నారని ఆచార్య వర్గం తెలియజేసింది.

# దేవాలయాల అభివృద్ధికి నిరంతరం సంపూర్ణ సహకారం

* ఘనంగా బీరప్ప విగ్రహ ప్రతిష్ట మహోత్సవం
* ఇస్నాపూర్ బీరప్ప దేవాలయం నిర్మాణానికి 10 లక్షల రూపాయలవిరాళం అందించిన ఎమ్మెల్యే

పటాన్ చెరు,జూలై 27, సమయం న్యూస్ : మానసిక ప్రశాంతత కోసం ప్రతి ఒక్కరూ దైవ చింతనను అలవాటు చేసుకోవాలని, నియోజకవర్గంలో నూతన దేవాలయాల నిర్మాణాలకు నిరంతరం సంపూర్ణ సహకార అందిస్తున్నామని పటాన్చెరు శాసన



సభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. ఇస్నాపూర్ మున్సిపల్ పరిధిలో నూతనంగా నిర్మించిన శ్రీ బీరప్ప స్వామి దేవాలయంలో ఆదివారం నిర్వహించిన విగ్రహ ప్రతిష్టాపన మహోత్సవం కార్యక్రమానికి ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఆలయ అభివృద్ధికి ఉడతా భక్తిగా పది లక్షల రూపాయల విరాళం అందించామని ఆయన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నూతన దేవాలయాలకు సంపూర్ణ సహకారం అందిస్తున్నామన్నారు. ఇప్పటి వరకు నియోజకవర్గంలో సుమారు 200 దేవాలయాల నిర్మాణం చేశామని ఆయన గుర్తుచేశారు.ఈ కార్యక్రమంలో గ్రామ మాజీ సర్పంచ్ వెంకటరెడ్డి, దశరథ రెడ్డి, ఆలయ కమిటీ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎల్కల్ లో ఘనంగా బోనాల పండుగ

రాయపోల్,జూలై27 రాయపోల్ మండలం ఎల్కల్ గ్రామంలో ఆదివారం సాయంత్రం ఎడ్ల బండ్లు, బోనాల ఊరేగింపు నిర్వహించారు. ఎడ్లబండ్లను అలంకరించి గ్రామంలోని ఆయా ఆలయాల చుట్టూ



ప్రదక్షణ చేయించారు. రాత్రి మహిళలు బోనాలను ఊరేగింపుగా తీసుకెళ్లి ఆయా అమ్మవార్ల ఆలయాల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వర్షాలు పుష్కలంగా కురిసి పంటలు బాగా పండాలని వేడుకున్నారు.



గ్రేటర్ వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ 17 వ డివిజన్ బొల్లికుంట గ్రామంలోని పోచమ్మ దేవాలయంలో దేవాలయ నిర్మాణ దాత గన్నోజు శ్రీనివాసాచారి గారు కుటుంబ సమేతంగా బోనాన్ని సమర్పించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించి బోనాల పండుగను ఆదివారం ప్రారంభించారు

- వరంగల్ , సమయం న్యూస్



## సిహెచ్ సి ఆస్పత్రిని తనిఖీ చేసిన అదనపు కలెక్టర్

హనుమకొండ, జులై27(సమయం న్యూస్) : హనుమకొండ జిల్లా కమలాపూర్ మండల కేంద్రంలోని సిహెచ్సి ఆసుపత్రిని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి ఆదివారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఓపి సేవలు, ఆస్పత్రికి సంబంధించిన పలు రికార్డులను పరిశీలించారు. ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలను వైద్యులు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. వార్డులో చికిత్స పొందుతున్న పేషంట్లతో వైద్య సదుపాయాలను అందుతున్న తీరును అడిగి తెలుసుకున్నారు. ఆస్పత్రికి వైద్య సేవలు నిమిత్తం వచ్చే ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించాలని అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి సూచించారు. ఈ సందర్భంగా సిహెచ్సి ఆసుపత్రి వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు. కమలాపూర్ తహసీల్దార్ కార్యాలయం సందర్శన కమలాపూర్ లోని తహసిల్దార్ కార్యాలయాన్ని జిల్లా అదనపు కలెక్టర్ వెంకట్ రెడ్డి సందర్శించారు. కార్యాలయంలో భూభారతి దరఖాస్తులను ఆన్లైన్ చేస్తుండగా ఆ ప్రక్రియను పరిశీలించి వాటి వివరాలను అక్కడి అధికారులను అడిగి తెలుసుకున్నారు.

# భారీ వర్షాలు, వరదల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలి

* **వ్యవసాయేతర అవసరాలకు యూరియా వినియోగిస్తే కఠిన చర్యలు**
* **సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి**
* **ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి సర్ఫరాజ్ అహ్మద్**




కరీంనగర్, జూలై 27(సమయం న్యూస్) : భారీ వర్షాలు, వరదల పట్ల ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని, యూరియా అక్రమ రవాణా నిర్మూలనకు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారి, హెచ్ఎండిఏ కమిషనర్ సర్ఫరాజ్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రత్యేక అధికారిగా రాష్ట్ర ప్రభుత్వం నియమించిన సర్ఫరాజ్ అహ్మద్ ఆదివారం కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్లో వివిధ శాఖల అధికారులతో జిల్లా సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో వర్షాలు కురుస్తున్నందున ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని ఆదేశించారు. భారీ వర్షాల వల్ల గండ్లు పడే అవకాశం ఉన్న చెరువులను ముందుగానే గుర్తించాలని అన్నారు. జలాశయాలను నీటి నిలువలను ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ అప్రమత్తంగా ఉండాలని అన్నారు. అత్యవసర సమయాల్లో ఆపద మిత్ర వాలంటీర్లను అందుబాటులో ఉంచాలన్నారు. యూరియా అక్రమ రవాణా జరగకుండా, వ్యవసాయేతర అవసరాలకు వినియోగించకుండా నిరంతరం తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. గోదాముల్లో నిలువలు పరిశీలించాలని, నిల్వల వివరాలు బోర్డులో పేర్కొని టోల్ ఫ్రీ నెంబర్ ఏర్పాటు చేయాలని అన్నారు. యూరియా తీసుకెళ్లే రైతుల వివరాలు రిజిస్టర్లో నమోదు చేయాలన్నారు. వ్యవసాయ, మార్కెటింగ్, రవాణా అధికారులు యూరియా అక్రమ రవాణాను అరికట్టాలని, అక్రమ రవాణాకు పాల్పడే వారిపై కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. యూరియాను అవసరానికి మించి వినియోగిస్తున్నారని, దీనివల్ల నేల స్వభావం దెబ్బతింటుందని, ఈ విషయం పట్ల రైతులకు అవగాహన కల్పించాలని అన్నారు. సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, గత సంవత్సరం డెంగీ, మలేరియా కేసులు ఎక్కడ ఎక్కువ నమోదయ్యాయో ఆ ఏరియాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అన్ని ప్రభుత్వాసుపత్రిలో అన్ని రకాల మందుల నిల్వలు అందుబాటులో ఉంచాలని, ఆరోగ్య సిబ్బందిని అప్రమత్తం చేయాలని, ఇంటింటికి ఆరోగ్య సర్వే వేగవంతం చేయాలని ఆదేశించారు. రేషన్ కార్డుల పంపిణీ ప్రక్రియ త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే మాట్లాడుతూ వరద విపత్తుల సాయం కోసం కలెక్టరేట్, మున్సిపల్ కార్పొరేషన్ వద్ద 24 గంటల పాటు పనిచేసే కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేశామని అన్నారు. ఆపదమిత్ర వాలంటీర్లను అలర్ట్ గా ఉంచామని తెలిపారు. జిల్లాలో ఇప్పటివరకు 7 డెంగ్యూ, 1 మలేరియా కేసులు నమోదయ్యాయని తెలిపారు. జిల్లాలో సాధారణ సగటు వర్షపాతం 339.1 కాగా 371.7 మిల్లీమీటర్ల సగటు వర్షపాతం నమోదయిందని తెలిపారు. లోయర్ మానేరు జలాశయంలో 24 టీఎంసీల కెపాసిటీ కి గాను 6.49 టిఎంసిల నీటి నిల్వ ఉందని, 1000 క్యూసెక్కుల ఇన్ ఫ్లో ఉందని తెలిపారు. జిల్లాలో కోళ్ల ఫారాలు, పరిశ్రమలలో యూరియా అక్రమ వినియోగంపై తనిఖీలు కొనసాగుతున్నాయని తెలిపారు. ఈ సమావేశంలో మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్, అడిషనల్ కలెక్టర్ లక్ష్మీ కిరణ్, ఆర్డీఓ మహేశ్వర్, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.



## వివిధ గ్రామాల బోనాల జాతర లో పాల్గొన్న గోవర్ధన్ రెడ్డి

పటాన్ చెరు(గుమ్మడిదల),జులై 27, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా గుమ్మడిదల మండలం లోని అనంతరం, దోమడుగు, అన్నారం గ్రామాలలో అంగరంగ వైభవంగా పోచమ్మ తల్లి బోనాల పండుగను గ్రామస్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా సిజిఆర్ ట్రస్ట్ చైర్మన్ చిమ్ముల గోవర్ధన్ రెడ్డి ఆదివారం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయాలలో అమ్మవారిని దర్శించుకొని ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. దోమడుగు గ్రామంలో నిర్వహిస్తున్న ఫలహారం బండి ఊరేగింపు కార్యక్రమంలో పాల్గొనడం జరిగింది. ఈ సందర్భంగా గోవర్ధన్ రెడ్డి మాట్లాడుతూ పోచమ్మ తల్లి చల్లని చూపులు మండల ప్రజలను సుభిక్షంగా ఉంచాలని, ఎలాంటి అంటూ వ్యాధులు ప్రబలకుండా చూడాలని, సకాలంలో వర్షాలు కురిసి పంటలు అధికంగా పండాలని అమ్మవారిని కోరుకున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పిటిసి సభ్యులు కుమార్ గౌడ్, సిజిఆర్ ట్రస్ట్ వైస్ చైర్మన్ చిమ్ముల నరేందర్ రెడ్డి, నాయకులు యాదిరెడ్డి, గోపాల్, సత్యనారాయణ, శ్రీనివాసరెడ్డి, భాస్కర్, ఆంజనేయులు, భాస్కర్ గౌడ్, గ్రామస్తులు, మహిళలు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

# మహిళల ఆర్థిక అభివృద్ధి కోసం ప్రభుత్వం కృషి చేస్తుంది

* **జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్**

మంచిర్యాల జూలై 27(సమయం న్యూస్): ఆర్థికంగా అభివృద్ధి చెందేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా కృషి చేస్తుందని జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. ఆదివారం జిల్లాలోని బెల్లంపల్లి మండల కేంద్రంలో గల ఆర్. పి. గార్డెన్స్ లో ఏర్పాటు చేసిన మహిళా శక్తి సంబరాలు, రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమంలో బెల్లంపల్లి నియోజకవర్గ శాసనసభ్యులు గడ్డం వినోద్, జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి కిషన్, జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి అధికారి పురుషోత్తం, బెల్లంపల్లి మండల తహసిల్దార్ కృష్ణ లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మహిళల ఆర్థిక అభ్యున్నతి కోసం ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందని తెలిపారు. అర్హత గల ప్రతి లబ్ధిదారుడికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని, ప్రజా పాలన కార్యక్రమంలో రేషన్ కార్డు గల అభ్యర్థులు పథకాల కొరకు దరఖాస్తులు చేసుకున్నారని, రేషన్ కార్డు లేని వారు రేషన్ కార్డు కొరకు దరఖాస్తు చేసుకున్నారని, వాటితో పాటు కార్డులో సభ్యుల చేర్పుల కొరకు అందిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించడం జరిగిందని తెలిపారు. మీ సేవా కేంద్రాల ద్వారా నిరంతర ప్రక్రియగా రేషన్ కార్డుల కొరకు దరఖాస్తులు స్వీకరించడం జరుగుతుందని తెలిపారు. పాత రేషన్ కార్డులలో పేర్లు కలిగి ఉండి, వివాహం అనంతరం నూతన రేషన్ కార్డుల కొరకు దరఖాస్తు చేసుకునేవారు తప్పనిసరిగా ముందు తమ పాత రేషన్ కార్డులో వివరాలు తొలగించుకోవాలని తెలిపారు. వివరాల తొలగింపు అనంతరం నూతన రేషన్ కార్డు కొరకు అందిన దరఖాస్తులను ఆర్.ఐ., తహసిల్దార్, జిల్లా పౌరసరఫరాల శాఖ స్థాయిలలో పరిశీలించి మంజూరు కొరకు ప్రభుత్వానికి పంపించడం జరుగుతుందని తెలిపారు. బెల్లంపల్లి మండలంలో 1 వేయి 509 నూతన రేషన్ కార్డులు జారీ చేయడం జరిగిందని, 2 వేల 806 మంది సభ్యులను రేషన్ కార్డులలో చేర్పించడం జరిగిందని తెలిపారు. 200 యూనిట్ల ఉచిత విద్యుత్ పథకం అందని అర్హులైన లబ్ధిదారులు దరఖాస్తు చేసుకోవచ్చని, ఒక రేషన్ కార్డు నుండి ఒక విద్యుత్ కనెక్షన్ కు మాత్రమే పథకం వర్తిస్తుందని తెలిపారు. 500 రూపాయలకు రాయితీ సిలిండర్ పథకంలో ఆధార్ అనుసంధానమైన బ్యాంకు ఖాతాలో రాయితీ సొమ్ము జమ చేయడం జరుగుతుందని తెలిపారు. అర్హత కలిగిన ప్రతి ఒక్కరికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడం జరుగుతుందని తెలిపారు. ప్రభుత్వం విద్య, వైద్య రంగాలపై ప్రత్యేక దృష్టి సారించడం జరుగుతుందని, జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో ప్రస్తుతం 70 శాతం మంది విద్యార్థులు తరగతులకు హాజరవుతున్నారని, విద్యార్థుల హాజరు శాతాన్ని 100 శాతానికి పెంపొందించేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ప్రతి సంవత్సరం 3 వేల నుండి 3 వేల 500 మంది విద్యార్థులు పాఠశాలలలో చేరుతుండగా, ఈ విద్యా సంవత్సరంలో 7 వేల మంది పిల్లలు జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలలో చేరారని తెలిపారు. ప్రభుత్వం అమ్మ ఆదర్శ పాఠశాలల కమిటీ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేస్తూ విద్యార్థులకు అవసరమైన సకల సదుపాయాలను కల్పించిందని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపడుతున్నామని, స్వయం సహాయక సంఘాల మహిళలను సమన్వయం చేసుకుంటూ పాఠశాలల అభివృద్ధికి చర్యలు చేపడుతున్నామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల ద్వారా నాణ్యమైన విద్యను అందించేందుకు ప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందని, ప్రభుత్వం కల్పిస్తున్న ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. జిల్లాలో నిర్మిస్తున్న గ్రామపంచాయతీ కార్యాలయాలలోని హాల్ ను స్వయం సహాయక సంఘాల సభ్యులు అవసరం మేరకు వినియోగించుకోవచ్చని తెలిపారు. జిల్లా కేంద్రంలో నిర్మిస్తున్న మహిళా శక్తి భవన్ నిర్మాణ పనులు తుది దశకు చేరుకున్నాయని తెలిపారు. రాష్ట్రంలోని మిగతా జిల్లాల కంటే మహిళా శక్తి భవన్ పనులు వేగంగా జరుగుతున్నాయని తెలిపారు.




## తెలుగు ఏఐ బూట్ క్యాంప్" ద్వారా కొత్త దారులు – సైదులు యాదవ్ విజయం

హైదరాబాద్, జులై 27 (సమయం న్యూస్): హైదరాబాద్లోని టీ హబ్ లో నిర్వహించిన తెలుగు ఏఐ బూట్ క్యాంప్ లో నిఖిల్ గూడ నేతృత్వంలో శిక్షణ పొంది ఏఐ ఆధారిత టూల్స్ వినియోగంపై లోతైన అవగాహన పొందారు. పోస్టర్ డిజైన్, డిజిటల్ మెసేజింగ్, లీడ్ జనరేషన్, మార్కెటింగ్ స్ట్రాటజీలు వంటి అంశాల్లో నైపుణ్యం సాధించిన నల్గొండ జిల్లా తిప్పర్తి మండలం, గడ్డి కొండారం గ్రామానికి చెందిన సైదులు యాదవ్.వాటిని తన రియల్ ఎస్టేట్ వ్యాపారంలో ప్రయోగించి అద్భుతమైన విజయాలను సాధిచ్చినారు. గంప నాగేశ్వరరావు, వేణు కళ్యాణ్ చేతుల మీదుగా గ్రాడ్యుయేషన్ సర్టిఫికేట్ అందుకున్నరు. అనంతరం ఆయన మాట్లాడుతూ, తెలుగు ఏఐ బూట్ క్యాంప్ వ్యాపార దిశను మార్చింది. ప్రొఫెషనల్గా, సమర్థవంతంగా ఉపయోగ పడుతుంది. పట్టుదలతో పాటు నూతన సాంకేతికతను కూడా యువతీ యువకులు నేర్చుకోవాలి. అప్పుడు మాత్రమే ప్రగతిశీలమైన మార్గంలో ముందుకెళ్లవచ్చు" అని తెలిపారు.







# వరంగల్‌ను స్పోర్ట్స్ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా దృఢ సంకల్పంతో ముందుకు సాగుతున్నాం!

* **అండర్-17 రాష్ట్రస్థాయి బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్-2025 ముగింపు కార్యక్రమంలో ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి గారు పాల్గొని విజేతలకు బహుమతులు ప్రదానం**

హనుమకొండ జూలై 27(సమయం న్యూస్) : వివిధ రంగాల్లో వేగంగా అభివృద్ధి చెందుతున్న వరంగల్ మహానగరాన్ని ఇప్పుడు క్రీడా రంగంలోనూ ప్రతిష్టాత్మక స్థాయికి తీసుకెళ్లేందుకు ప్రభుత్వం తీవ్రంగా కృషి చేస్తోందని, ముఖ్యంగా యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు చర్యలు చేపడుతున్నామని వరంగల్ పశ్చిమ నియోజకవర్గ శాసన సభ్యులు నాయిని రాజేందర్ రెడ్డి గారు తెలిపారు. ఆదివారం రోజున హనుమకొండ ఆఫీసర్స్ క్లబ్ వేదికగా జరిగిన 11వ తెలంగాణ రాష్ట్ర స్థాయి అండర్ 17 బ్యాడ్మింటన్ చాంపియన్ షిప్ 2025 ముగింపు సమావేశంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎమ్మెల్యే గారు, మూడు రోజులపాటు జరిగిన పోటీల్లో విజేతలైన క్రీడాకారులకు ట్రోఫీలు, ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మన యువత ప్రతిభకు వేదికలు సిద్ధం చేయడం ప్రభుత్వ బాధ్యత. త్వరలో వరంగల్ నగరంలో అంతర్జాతీయ ప్రమాణాలకే సరిపడే క్రికెట్ స్టేడియం ఏర్పాటు కానుంది. క్రీడా పాఠశాల కోసం ప్రభుత్వం సన్నద్ధతతో ముందడుగు వేసింది. నూతన భవన నిర్మాణానికి నిధులు విడుదలయ్యాయి. తరగతుల ప్రారంభానికి కూడా తగిన చర్యలు తీసుకుంటున్నాం," అని తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి గారు అభివృద్ధిపై, ముఖ్యంగా యువత భవిష్యత్ పై అపారమైన దృష్టి పెట్టి, వరంగల్ నగరాన్ని అన్ని విభాగాల్లో ముందుకు తీసుకెళ్లే దిశగా పలు నిర్ణయాలు తీసుకుంటున్నారు. ప్రజా ప్రభుత్వంగా విద్య, వ్యవసాయం, వైద్యం, క్రీడలు అన్నీ సమాన ప్రాధాన్యంతో అభివృద్ధి చేయాలన్నదే లక్ష్యం అని తెలిపారు. ఈ సందర్భంగా హనుమకొండ ప్రాంతానికి చెందిన క్రెడాయి ప్రధాన కార్యదర్శి శాఖమూరి అమరేందర్ గారి కుమారుడు ఐఏఎస్ అధికారి శ్రీ సాయి ఆశ్రిత్ గారిని ఎమ్మెల్యే గారు ప్రత్యేకంగా అభినందించారు. వారిని ఎంతో గర్వంతో సత్కరించారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, జిల్లా అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, కోచ్‌లు, క్రీడాభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ప్రభుత్వ పథకాల అమలుపై మంత్రుల సమీక్ష

పాల్వంచ: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో అమలవుతున్న ప్రభుత్వ పథకాలు, సంక్షేమ కార్యక్రమాలు, అభివృద్ధి పనుల పురోగతిపై మంత్రులు సమీక్ష నిర్వహించారు. అధికారులతో డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క, మంత్రులు వాకిటి శ్రీహరి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు సమావేశమయ్యారు. జిల్లాలో వర్షాల పరిస్థితి, ముంపు ప్రాంతాల్లో తలెత్తుతున్న సమస్యలు, సీజనల్ వ్యాధుల వ్యాప్తి, రైతులకు ఎరువుల లభ్యత, ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల పురోగతి, రేషన్ కార్డుల పంపిణీ తదితర అంశాలపైనా చర్చించారు. ఈ సందర్భంగా పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ.. గతేడాది మాదిరిగా ముంపు పరిస్థితులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ముంపు ప్రాంతాల్లో తాత్కాలిక నివాస శిబిరాలను సిద్ధం చేయాలన్నారు. సీజనల్ వ్యాధుల నియంత్రణకు వైద్యశాఖ సన్నద్ధంగా ఉండాలని.. ప్రభుత్వ ఆస్పత్రుల్లో ఔషధాలు, అవసరమైన వైద్య సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణం వేగవంతం చేసేందుకు చర్యలు తీసుకోవాలని.. ఇసుక సరఫరాలో ఆటంకాలు లేకుండా చూడాలని మంత్రి ఆదేశించారు. అభివృద్ధి పనుల నాణ్యతతో పాటు నిర్దేశిత గడువులో పూర్తికావాలన్నారు.



## సీఎం రమేశ్ అడిగిన ప్రశ్నలకు కేటీఆర్ సమాధానం చెప్పాలి: ఆది శ్రీనివాస్



హైదరాబాద్: తెలంగాణ పదాన్ని పార్టీ నుంచి తీసి భారత రాష్ట్ర సమితిగా మార్చుకున్నప్పుడే రాష్ట్రంతో ఆ పార్టీకి బంధం తెగిపోయిందని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. రాష్ట్రాన్నిచ్చిన సోనియా గాంధీ వద్ద తెరాస (ఇప్పటి భారత రాష్ట్ర సమితి)ను విలీనం చేస్తానని చెప్పి కేసీఆర్ మోసం చేశారని, పదేళ్లు అధికారంలో ఉండి ఆంధ్రప్రదేశ్ వ్యాపారులకే కాంట్రాక్టులు ఇచ్చారని విమర్శించారు. ''కేటీఆర్.. పార్టీ విలీనం కోసం భాజపా ఎంపీ సీఎం రమేశ్ ఇంటికి మీరు వెళ్లారా? లేదా? కవితపై ఉన్న ఈడీ, సీబీఐ కేసులు కొట్టివేస్తే భాజపాలో భారత రాష్ట్ర సమితిని విలీనం చేస్తామని చెప్పారా లేదా? భారత రాష్ట్ర సమితి ఒక అవినీతి పార్టీ అని.. ఆ పార్టీ విలీనం వద్దంటే వద్దని భాజపా పెద్దలు అన్న మాట వాస్తవమా కాదా? మీరు సమాధానం చెప్పాలి. కొన్ని సామాజిక వర్గాలను కూడా మీరు తిట్టినట్లు సీఎం రమేశ్ చెప్పారు. విషయాన్ని పక్కదారి పట్టించకుండా ధైర్యం ఉంటే సీఎం రమేశ్‌కు సమాధానం చెప్పాలి. కేటీఆర్ వైఖరిని రాష్ట్ర ప్రజలు గమనించాలి''అని ఆది శ్రీనివాస్ అన్నారు.

## దంపతులను నమ్మించి మోసం..
## డాక్టర్ నమ్రత అసలు సరోగసీ చేయలేదు: డీసీపీ



హైదరాబాద్: సికింద్రాబాద్‌లోని సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌కు సరైన అనుమతులు లేవని డీసీపీ రష్మీ పెరుమాళ్ తెలిపారు. ఆ ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్లకు 2021లోనే గడువు తీరిందని చెప్పారు. టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్ వ్యవహారంపై ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో పలు విషయాలను డీసీపీ వెల్లడించారు. సంతానం కలగని దంపతులను ఆస్పత్రి నిర్వాహకురాలు డాక్టర్ నమ్రత మోసగించారని చెప్పారు. ''సంతానం కలగకపోవడంతో రాజస్థాన్‌కు చెందిన దంపతులు సృష్టి టెస్ట్ ట్యూబ్ బేబీ సెంటర్‌కు వెళ్లారు. దంపతులకు డాక్టర్ నమ్రత పలు పరీక్షలు నిర్వహించి ఐవీఎఫ్ సాధ్యం కాదని.. సరోగసీ ద్వారా పొందవచ్చని చెప్పారు. రూ.30లక్షలు ఖర్చు అవుతుందన్నారు. సరోగసీ కోసం విశాఖకు చెందిన దంపతులను ఒప్పించానని నమ్రత చెప్పారు. వారు రూ.5లక్షలు అడిగారని తెలిపారు. దంపతుల నుంచి అండం, వీర్యం సేకరించి సరోగసీ చేస్తున్నామన్నారు. విశాఖలోని ఓ గర్భిణిని సరోగసీ మదర్ అని చూపించారు.

**అనుమానంతో డీఎన్ఏ టెస్టు చేస్తే..**

కొన్నాళ్ల తర్వాత విశాఖ ఆస్పత్రిలో ఓ బాబును దంపతులకు ఇచ్చారు. సరోగసీకి అంగీకరించిన మహిళ అదనంగా డబ్బు అడుగుతున్నారన్నారు. డాక్టర్ అడిగిన అదనపు డబ్బులు కూడా దంపతులు ఇచ్చారు. ఈ కేసులో నమ్రత అసలు సరోగసీ చేయలేదు. శిశువు వద్దనుకున్న అస్సాంకు చెందిన ఒక మహిళకు రూ.90వేలు చెల్లించారు. ఆమెకు శిశువు పుట్టగానే తీసుకున్నారు. ఆ తర్వాత దంపతులకు అనుమానం వచ్చింది. దీంతో డీఎన్ఏ టెస్టు చేయించారు. ఈ క్రమంలో శిశువు ఆ దంపతులకు చెందినది కాదని తేలింది.

**డాక్టర్, సిబ్బంది సరైన నిపుణులు కాదు**

సృష్టి టెస్ట్ ట్యూబ్ సెంటర్ నిర్వాహకులు చాలా నిబంధనలు ఉల్లంఘించారు. ఆ ఆస్పత్రికి సరైన అనుమతులు లేవు.. చాలా ఫిర్యాదులు కూడా ఉన్నాయి. డాక్టర్, సిబ్బంది ఎవరూ సరైన నిపుణులు కాదు. ఆస్పత్రి రిజిస్ట్రేషన్ సర్టిఫికెట్స్‌కు 2021లోనే గడువు తీరింది. మెడికల్ కౌన్సిల్ రిజిస్ట్రేషన్ లేకుండా అక్రమంగా నిర్వహిస్తున్నారు. దీనిపై కోర్టులో కేసులు నడుస్తున్నాయి. అందుకే ఆస్పత్రిని మూసివేస్తున్నట్లు కోర్టుకు చెప్పారు. ఆస్పత్రిని చాటుమాటుగా నిర్వహిస్తున్నందున అధికారులు గుర్తించలేకపోయారు. ఇది సరోగసీ కాదు.. చైల్డ్ ట్రాఫికింగ్. న్యాయవాదినని చెప్పుకొని నమ్రత కుమారుడు జయంత్ కృష్ణ బాధితులను బెదిరించారు. ఈ వ్యవహారంపై కేసు నమోదు చేశాం. ఈ కేసులో 8 మంది నిందితులను అరెస్ట్ చేశాం'' అని డీసీపీ రష్మీ పెరుమాళ్ వివరించారు.

## అన్నీ ఆలోచించే భాజపాకు రాజీనామా చేశా: ఎమ్మెల్యే రాజాసింగ్



హైదరాబాద్: తాను అన్నీ ఆలోచించే భాజపాకు రాజీనామా చేశానని గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్ అన్నారు. భాజపాలో తిరిగి చేరేందుకు తాను ప్రయత్నిస్తున్నట్లు.. కార్యకర్తల బృందాన్ని రాష్ట్ర కార్యాలయానికి పంపినట్లు తప్పుడు ప్రచారం చేస్తున్నారని చెప్పారు. ''నా రాజీనామా వెనుక ఏ కుట్రా లేదు. ఎవరితో పార్టీకి నష్టం జరిగిందో అధిష్ఠానానికి చెప్పాలనుకున్నా. లక్షలాది మంది భాజపా కార్యకర్తలు పార్టీ కోసం జీవితాలను త్యాగం చేశారు. కేంద్రహోంమంత్రి అమిత్‌షా నాకు ఫోన్ చేయలేదు. ఆయన ఫోన్ చేసేంత పెద్దవాడిని నేను కాదు. తెలంగాణలో భాజపా అధికారంలోకి రావాలంటే ఒక ఫైటర్ కావాలి'' అని రాజాసింగ్ అన్నారు.

## మాపై కోపముంటే జైల్లో పెట్టండి..
## విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు: హరీశ్‌రావు



నాగర్‌కర్నూల్: ''సీఎం రేవంత్‌రెడ్డి.. మాపై కోపం ఉంటే జైల్లో పెట్టండి.. విద్యార్థుల భవిష్యత్తుతో ఆడుకోవద్దు''అని మాజీ మంత్రి, భారత రాష్ట్ర సమితి నేత హరీశ్‌రావు అన్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా ఉయ్యాలవాడలోని బాలికల గురుకుల పాఠశాలలో రాత్రి ఫుడ్ పాయిజన్ అయి అస్వస్థతకు గురైన విద్యార్థినులను ఆదివారం ఆయన పరామర్శించారు. అనంతరం మీడియాతో హరీశ్‌రావు మాట్లాడుతూ.. కలుషిత ఆహారం తిని విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారని ఆరోపించారు. సాంబార్‌లో కూడా పురుగులు వస్తున్నాయని విద్యార్థినులు చెబుతున్నారన్నారు. ''గురుకులాల్లో మెనూ ప్రకారం తిండి పెట్టట్లేదు. రేవంత్‌రెడ్డి నుంచి మాటలు కాదు.. చేతలు కావాలి. ఈ సారి కలుషిత ఆహారం కేసులు వస్తే చర్యలు తీసుకుంటానని సీఎం అన్నారు. సీఎం మాటలు అధికారులు వినట్లేదా? దిల్లీకి వెళ్లడానికి ఆయనకు సమయం ఉంటుంది. విద్యార్థుల సమస్యలపై చర్చించడానికి లేదా? ఈ అంశంపై అసెంబ్లీ సమావేశాలు పెట్టి చర్చించాలి. మానవహక్కుల కమిషన్, హైకోర్టు ఈ ఘటనల్ని సుమోటోగా తీసుకోవాలి. కాంగ్రెస్ హయాంలో ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య తగ్గుతోంది''అని హరీశ్‌రావు అన్నారు.

## తెలంగాణలో భాజపా ఒంటరిగానే పోటీ : రామచందర్‌రావు



హైదరాబాద్: తెలంగాణలో భాజపా ఎప్పటికీ ఒంటరిగానే పోటీ చేస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు అన్నారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థలతో పాటు అసెంబ్లీ ఎన్నికల్లోనూ సింగిల్‌గానే బరిలో ఉంటామని స్పష్టం చేశారు. ప్రభుత్వ హాస్టళ్లలో విద్యార్థుల అనారోగ్య పరిస్థితులపై సీఎం రేవంత్‌రెడ్డి స్పందించాలని రామచందర్‌రావు డిమాండ్ చేశారు. హాస్టళ్లలో విద్యార్థులకు సరైన భోజనం పెట్టడం లేదని.. కలుషిత ఆహార ఘటనలపై దర్యాప్తు చేసి చర్యలు తీసుకోవాలని కోరారు.

## సూర్యాపేటలో బంగారం చోరీ ఘటన.. మహిళ అరెస్ట్



సూర్యాపేట (నేర విభాగం): ఈనెల 21న సూర్యాపేటలో జరిగిన బంగారం చోరీ ఘటనలో ఒకరిని అరెస్ట్ చేశామని జిల్లా ఎస్పీ నరసింహ తెలిపారు. కేసు దర్యాప్తు కొనసాగుతోందని చెప్పారు. సూర్యాపేటలో ఆదివారం నిర్వహించిన మీడియా సమావేశంలో కేసు వివరాలను ఆయన వెల్లడించారు. ''జ్యువెలరీ షాపులో ఐదుగురు నిందితులు 2.05కిలోల బంగారం చోరీ చేసినట్లు గుర్తించాం. వీరిలో ముగ్గురు నేపాల్ దేశస్థులు. ఇద్దరు ఝార్ఖండ్‌కు చెందిన వారు. నిందితులు షాపునకు సమీపంలో ఇల్లు అద్దెకు తీసుకొని రెక్కీ నిర్వహించారు. ఈ కేసులో ఓ మహిళను అరెస్ట్ చేశాం. ఆమె నుంచి 14 తులాల బంగారం స్వాధీనం చేసుకున్నాం. నిందితుల చోరీకి ఆ మహిళ సహకరించింది. చోరీ చేసిన బంగారం హైదరాబాద్‌లో విక్రయించేందుకు తీసుకెళ్తూ సూర్యాపేట బస్టాండ్‌లో ఆమె పట్టుబడింది. నిందితులను పట్టుకునేందుకు ఐదు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశాం'' అని ఎస్పీ తెలిపారు.

## యాదగిరిగుట్ట నరసింహస్వామి ఆలయానికి పోటెత్తిన భక్తులు

యాదగిరిగుట్ట: శ్రావణ మాసం తొలి ఆదివారం ప్రముఖ పుణ్యక్షేత్రమైన యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో భక్తుల రద్దీ నెలకొంది. వేకువజాము నుంచే భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. స్వామివారి దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరారు. స్వామి, అమ్మవార్ల నిత్య కల్యాణంలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. ప్రసాద విక్రయ శాల, కొండకింద సత్యనారాయణ స్వామి వ్రత మండపం, లక్ష్మీ పుష్కరిణి, కారు పార్కింగ్, బస్టాండ్‌లో భక్తుల సందడి నెలకొంది. స్వామివారి ధర్మ దర్శనానికి గంట సమయం, ప్రత్యేక దర్శనానికి 2 గంటల సమయం పడుతోంది.





## ఎయిర్ పోర్టుకు రాణి రుద్రమ దేవి పేరు పెట్టాలి.. లేదంటే పోరాటమే

**: ఎమ్మెల్సీ కవిత డిమాండ్**



వరంగల్‌లో రాబోతున్న ఎయిర్ పోర్ట్ కి రాణి రుద్రమదేవి పేరు పెట్టాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవిత ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం వరంగల్ పర్యటనలో ఉన్న ఎమ్మెల్సీ కవిత హన్మకొండలో మీడియాతో మాట్లాడారు. వరంగల్ మామునూరు ఎయిర్ పోర్టుకు రాణి రుద్రమ దేవి పేరు పెట్టాల్సిందేనని డిమాండ్ చేశారు. ముఖ్యంగా ఓరుగల్లు ప్రజలు ఈ డిమాండ్ చేయాల్సిన అవసరం ఉందని సూచించారు. ఎందుకంటే కాంగ్రెస్ ప్రభుత్వం చిన్న బస్టాండ్ నిర్మించినా.. రాజీవ్ గాంధీ, ఇందిరా గాంధీ వంటి గాంధీ పేర్లు పెట్టి మన తెలంగాణ సంస్కృతిని వెనక్కి నెట్టే ప్రయత్నం చేస్తారని విమర్శించారు. రాణి రుద్రమ దేవి పేరు పెట్టే వరకు ఊరుకోవద్దని అన్నారు. దీనిపై తెలంగాణ జాగృతి పోరాటం చేస్తాదని, ఈ విషయంపై సంబంధిత కేంద్ర మంత్రికి లేఖ రాయబోతున్నట్లు చెప్పుకొచ్చారు. ఇక, వరంగల్ రైతు డిక్లరేషన్ పేరిట రైతులకిచ్చిన రూ. 2లక్షల రుణమాఫీ హామీని కాంగ్రెస్ సర్కార్ నీరుగార్చిందన్నారు. రైతు డిక్లరేషన్ ఫుల్ ఫిల్ కాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీని నమ్మి రైతులు ఓటు వేశారని, అలాంటి రైతులను నిండా ముంచిన ప్రభుత్వం ఇప్పుడు నడుస్తోందని మండిపడ్డారు. కౌలు రైతులకు ఏడాదికి రూ. 15 వేలు ఇస్తామని ఇచ్చిన హామీ ఏమైంది ? అని ప్రశ్నించారు. అధికారంలోకి వచ్చిన తర్వాత సీఎం రేవంత్ రెడ్డి కౌలు రైతుల గురించి ఎందుకు మాట్లాడడం లేదన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో లబ్ధి పొందడం కోసం ఇటీవల రైతు భరోసా ఇచ్చారని తెలిపారు. రైతు భరోసా కూడా ఇచ్చిన హామీ ప్రకారం ఇవ్వడం లేదని, రూ.15 వేలు అని చెప్పి.. రూ.12 వేలు ఇచ్చారని వివరించారు.

# ఇది గిల్ టీమ్.. గంభీర్ టీమ్ కాదు: సునీల్ గావస్కర్



ఇప్పుడు ఎవరు భారత జట్టును నడిపిస్తున్నారు? ప్రధాన కోచ్ గౌతమ్ గంభీర్ లేదా కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌లో ఎవరు నిర్ణయాలు తీసుకుంటున్నారు? డ్రెస్సింగ్ రూమ్‌లో గంభీర్ ముందు గిల్ ధైర్యంగా తన అభిప్రాయాలను వెల్లడిస్తున్నాడా?.. టీమ్ఇండియా అభిమానుల్లో మెదిలే ప్రశ్నలు ఇవి. ఇక కుల్‌దీప్ యాదవ్‌ను ఒక్క మ్యాచ్‌లోనూ ఆడించకపోవడంపై విమర్శలూ వస్తున్నాయి. ఈ క్రమంలో క్రికెట్ దిగ్గజం సునీల్ గావస్కర్ ఎదుట వ్యాఖ్యాత హర్షా భోగ్లే ఓ ప్రశ్న ఉంచాడు.

హర్షా భోగ్లే: "గంభీర్ లేదా ఇతర కోచింగ్ స్టాఫ్ వద్దకు గిల్ వెళ్లి.. 'ఇది నా జట్టు' అని చెప్పగలడా?"

సునీల్ గావస్కర్: మనకు కోచ్‌లు ఎవరూ లేరు. మనకు కేవలం మాజీ ఆటగాళ్లు జట్టుకు మేనేజర్లుగా, అసిస్టెంట్ మేనేజర్లుగా ఉన్నారు. అలాంటి వారి వద్దకు వెళ్లి మాట్లాడొచ్చు. లంచ్ టైమ్ లేదా రోజు ముగిసిన తర్వాత సలహాలు ఇస్తుంటారు. మ్యాచ్ సమయంలో అవసరమైతే సూచనలు చేస్తారు. అందుకే, కోచ్ కెప్టెన్ కాంబినేషన్ గురించి ఆలోచించడం నాకు కష్టంగా ఉంది. నేను సారథిగా ఉన్నప్పుడు మా జట్టుతో మాజీ ప్లేయర్ ఎవరూ లేరు. మాకు వింగ్ కమాండర్ దుర్రానీ, రాజ్ సింగ్ దుంగార్‌పూర్ మాత్రమే ఉన్నారు. ఎర్రపల్లి ప్రసన్న కొద్ది రోజులు ఉన్నారు. అయినా సరే, కెప్టెన్‌దే జట్టు విషయంలో తుది నిర్ణయం అవుతుంది. తన టీమ్‌లో కుల్‌దీప్ ఉండాలా? శార్దూల్ ఉండాలా? అనేది సారథి చూసుకుంటాడు. అభిమానులు కేవలం కెప్టెన్ గురించే మాట్లాడుకుంటారు. జట్టులో ఎవరు ఉండాలి? ఉండకూడదు? అనేది కెప్టెన్‌దే నిర్ణయం. ఏం జరిగినా అతడిదే పూర్తి బాధ్యత. ఎందుకంటే జట్టును నడిపించేది సారథి మాత్రమే.

**ఇలా ఎప్పుడూ చూడలేదు**

"భారత క్రికెట్ పరిస్థితి ఇంతకు ముందెప్పుడూ ఇలా లేదు. బీసీసీఐ నుంచి గంభీర్ తనకు కావాల్సినవన్నీ తీసుకున్నాడు. కేకేఆర్ స్టాఫ్‌ను తనతోపాటు తెచ్చుకున్నాడు. రోహిత్, విరాట్ రిటైర్‌మెంట్ ప్రకటించడంలో అతడి పాత్ర కూడా ఉందనేది బయట వినిపిస్తున్న టాక్. కెప్టెన్ కంటే తన వద్దే ఎక్కువ పవర్ ఉండాలనుకుంటున్నట్లు అనిపిస్తోంది. ఇప్పుడు జట్టు పేలవ ప్రదర్శనకు అతడిదే మొత్తం క్రెడిట్" అని గావస్కర్ వ్యాఖ్యానించాడు.




## ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ రెండో గేమ్ డ్రా..

# ఫలితం తేల్చనున్న టైబ్రేకర్

బాటుమి: ఫిడే మహిళల చెస్ ప్రపంచకప్ ఫైనల్ గేమ్ ఆసక్తికరంగా సాగుతోంది. తొలి గేమ్‌ను డ్రాగా ముగించిన భారత అమ్మాయిలు కోనేరు హంపి, దివ్య దేశ్‌ముఖ్ రెండో గేమ్‌ను కూడా డ్రా చేశారు. దీంతో ఫలితం తేల్చేందుకు సోమవారం టై బ్రేకర్ ఆడనున్నారు. తొలి గేమ్‌లో నల్లపావులతో ఆడిన హంపి.. ఇవాళ తెల్లపావులతో ఆడింది. ఇది కొంత సానుకూల అంశమైన ప్పటికీ.. దివ్య దేశ్‌ముఖ్ అదే స్థాయిలో ప్రతిస్పందించడంతో గేమ్‌ను డ్రాగా ముగించక తప్పలేదు.

# సుందర్, జడేజా సెంచరీలు .. డ్రాగా ముగిసిన నాలుగో టెస్టు

మాంచెస్టర్: భారత్ ఇంగ్లాండ్ మధ్య జరిగిన నాలుగో టెస్ట్ డ్రాగా ముగిసింది. రవీంద్ర జడేజా (103*; 185 బంతుల్లో 13 ఫోర్లు, 1 సిక్స్), వాషింగ్టన్ సుందర్ (101*; 206 బంతుల్లో 9 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీలు చేసి భారత్‌ను గట్టెక్కించారు. కెప్టెన్ శుభ్‌మన్ గిల్ (103; 12 ఫోర్లు) కూడా శతకం చేశాడు. కేఎల్ రాహుల్ (90; 230 బంతుల్లో 8 ఫోర్లు) సెంచరీ చేసే ఛాన్స్ మిస్ చేసుకున్నాడు. తొలి ఇన్నింగ్స్‌లో భారత్ 358, ఇంగ్లాండ్ 669 పరుగులకు ఆలౌటయ్యాయి. రెండో ఇన్నింగ్స్‌లో భారత్ 425/4. సుందర్ శతకం చేసిన తర్వాత మ్యాచ్ డ్రాగా ముగిసినట్లు అంపైర్లు ప్రకటించారు. మ్యాచ్ ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో 10 ఓవర్లు మిగిలుండగానే మ్యాచ్‌ను డ్రాగా ముగించేందుకు ఇరుజట్లు అంగీకరించాయి.

# సినిమా

## ఓటీటీలోకి 'తమ్ముడు' మూవీ.. స్ట్రీమింగ్ ఎప్పుడంటే?



నితిన్ హీరోగా నటించిన 'తమ్ముడు' సినిమా ఓటీటీ విడుదల తేదీ ఖరారైంది. 'నెట్‌ఫ్లిక్స్'లో ఆగస్టు 1 నుంచి స్ట్రీమింగ్ కానుంది. తెలుగు, తమిళ్, మలయాళం, కన్నడ ఆడియోతో అందుబాటులో ఉండనుంది. అక్కాతమ్ముడి అనుబంధం నేపథ్యంతో దర్శకుడు శ్రీరామ్ వేణు తెరకెక్కించిన చిత్రమిది. ఈ నెల 4న థియేటర్లలో విడుదలైన సంగతి తెలిసిందే. కొంతకాలం విరామం అనంతరం నటి లయ ఈ సినిమాతో తెలుగు ప్రేక్షకుల ముందుకొచ్చారు. నితిన్‌కు అక్కగా ఆమె నటించారు. కథేంటంటే: జై (నితిన్) విలువిద్యలో దేశం తరపున ఎన్నో పతకాలు సాధిస్తాడు. మరొక పెద్ద లక్ష్యంపై గురి పెట్టినా, ఏకాగ్రత కుదరదు. అక్క స్నేహలత (లయ)తో ముడిపడిన జ్ఞాపకాలు వెంటాడుతుంటాయి. కొన్ని సంఘటనలతో కుటుంబానికి దూరమవుతుంది స్నేహలత. ఇంకెప్పుడూ పుట్టింటి గడప తొక్కనని శపథం చేసి వెళ్లిపోతుంది. తండ్రి చనిపోయినా వెళ్లదు. అక్కకు దగ్గరవ్వాలని తన స్నేహితురాలు చిత్ర (వర్ష బొల్లమ్మ)తో కలిసి బయల్దేరతాడు. తీరా అక్కడకు వెళ్లాక ఆమె తన కుటుంబంతో కలిసి అంబర గొడుగు అటవీ ప్రాంతంలో జరిగే అమ్మవారి జాతరకు వెళ్లినట్టు తెలుస్తుంది. అలాగే ఆమె తన పేరును ఝాన్సీగా మార్చుకున్నట్టు తెలుసుకుంటాడు. మరోవైపు ఝాన్సీ, ఆమె కుటుంబాన్ని అజర్వాల్ (సౌరభ్ సచ్‌దేవా) ముఠా లక్ష్యంగా చేసుకుంటుంది. మరి, జై తన అక్క ఝాన్సీని కలుసుకున్నాడా? అజర్వాల్ ముఠా నుంచి ఝాన్సీ, ఆమె కుటుంబం ఎలా బయట పడింది? అన్నది ఈ కథలో కీలకం.



## శ్రీవారి సన్నిధిలో కింగ్డమ్ టీం

హీరో విజయ్ దేవరకొండ, హీరోయిన్ భాగ్యశ్రీ బోర్సేతో పాటు కింగ్డమ్ మూవీ టీం తిరుమల శ్రీవారిని దర్శించుకుంది. ఇవాళ తెల్లవారుజామున నైవేద్య విరామ సమయంలో స్వామి సేవలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించింది. దర్శనానంతరం వీరికి ఆలయ రంగనాయకుల మండపంలో పండితులు వేద ఆశీర్వచనం చేశారు. ఆపై టీటీడీ అధికారులు సినిమా బృందానికి స్వామివారి తీర్థప్రసాదాలను అందజేశారు. ఈ సందర్భంగా విజయ్ మాట్లాడుతూ 'కింగ్డమ్ సినిమా విడుదలకు ముందు స్వామి వారిని దర్శించుకోవడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన చల్లని దీవెనలు అందరికీ ఉండాలి. ఆయన ఆశీస్సులతో మా సినిమా సూపర్‌హిట్ అవ్వాలని కోరుకుంటున్నాను' అని అన్నారు.కాగా...గౌతమ్ తిన్ననూరి తెరకెక్కించిన కింగ్డమ్ మూవీ ఈనెల 31న ప్రేక్షకుల ముందుకు రానుంది.

## అదిరిపోయే స్టిల్

మహర్షి మూవీ ద్వారా సినీ ఇండస్ట్రీలో అడుగు పెట్టింది దివి వాద్య. లెట్స్ గో, సీన్ నెంబర్ 72 సహా పలు సినిమాల్లో నటించింది. టాలీవుడ్‌లో గ్లామర్‌తో పాట అటిట్యూడ్‌కు కూడా ఓ రేంజ్ క్రేజ్ తెచ్చుకున్న ఈ బ్యూటీ.. బిగ్ బాస్ షోతో పాపులర్ అయింది. ఫ్యాషన్ షోస్, వెబ్ కంటెంట్‌తో మంచి హైప్ తెచ్చుకుంది. ఈ భామ సోషల్ మీడియాలోనూ చాలా యాక్టివ్‌గా ఉంటుంది. తరచూ ఆమె చేసే ఫొటోషూట్లు వైరల్ అవుతూ ఉంటాయి. తాజాగా బాలి ట్రిప్‌లో ఆమె వేసుకున్న గ్రీన్ డ్రెస్ ఫొటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో హీటెక్కిస్తున్నాయి. గ్రీన్ మల్టీ షేడెట్ డిజైనర్ అవుట్‌ఫిట్‌లో ఈ భామ చేసిన ఫొటోషూట్ గ్లామర్, నేచురల్ వాతావరణం కలబోతగా ఆకట్టుకుంటోంది. ఫీల్డ్ బ్యాక్ డ్రాప్ మధ్యలో చలాకీగా ఆమె పోజులిచ్చింది. తళతళలాడే స్కిన్ టోన్, లాంగ్ హెయిర్, సింపుల్ మేకప్‌తో ఈ భామ ఇచ్చిన అటిట్యూడ్ కూడా లుక్స్‌కు హైలైట్ అయింది. ఇది చూసిన నెటిజన్లు బికినీకి ఏమాత్రం తీసిపోదంటూ కామెంట్లు పెడుతున్నారు.





మీనాక్షి చౌదరి ఇన్‌స్టాగ్రామ్‌లో కొత్త చిత్రాన్ని షేర్ చేశారు. ఆమె పెద్ద పూల ప్రింట్లతో లేత గులాబీ రంగు చీరను ధరించింది. చీరపై ఉన్న పువ్వులు నారింజ మరియు ఆకుపచ్చ రంగులలో ఉన్నాయి మరియు ఆమె దానిని స్లీవ్‌లెస్ బ్లౌజ్‌తో సరిపోల్చింది. బ్లౌజ్ నారింజ మరియు ఆకుపచ్చ నమూనాలను కలిగి ఉంది. ఆమె తన జుట్టును సరళంగా స్టైల్ చేసింది మరియు ఆమె అతిలోక సుందరిలా కనిపిస్తుంది.

## వెంటనే ఓకే చెప్పా

'గబ్బర్‌సింగ్', 'రేసుగుర్రం', 'ఎవడు', 'వాల్తేరు వీరయ్య' వంటి మూవీలతో టాలీవుడ్‌లో మంచి గుర్తింపు తెచ్చుకుంది నటి శ్రుతి హాసన్. ఆమె కీలక పాత్రలో నటించిన చిత్రం 'కూలీ'. సూపర్‌స్టార్ రజినీకాంత్, కింగ్ నాగార్జున, బాలీవుడ్ హీరో ఆమీర్ ఖాన్ ప్రధాన పాత్రల్లో లోకేశ్ కనకరాజ్ ఈ మూవీని తెరకెక్కించారు. వచ్చే నెల 14న ఈ సినిమా విడుదల కానుంది. చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా శ్రుతి హాసన్ మీడియాతో మూవీ విశేషాలను పంచుకుంది. ఓ అల్బమ్ కోసం దర్శకుడు లోకేశ్ కనకరాజ్‌ను ఆమె గతంలో కలిసిందట. ఆ సమయంలో కూలీ మూవీలో తన పాత్ర గురించి చెప్పాడట డైరెక్టర్. అందులో తన పాత్ర గురించి వినగానే ఈ భామ చాలా సంతోషపడి పోయిందట. ఏమాత్రం ఆలస్యం చేయకుండా వెంటనే ఓకే చెప్పిందట. అంతగా ఆ పాత్ర నచ్చిందట శ్రుతి హాసన్‌కు. అది అందరూ కనెక్ట్ అయ్యే పాత్ర అని, చక్కటి భావోద్వేగాలతో నిండిన ఆ రోల్ తన కెరీర్‌లోనే ప్రత్యేకమైందని చెప్పింది. అంతే కాదు సూపర్ స్టార్ రజినీకాంత్‌తో నటించడం అదృష్టంగా భావిస్తున్నట్లు పేర్కొంది. నాగార్జున విలన్ పాత్రలో అద్భుతంగా నటించారని, దర్శకుడి విజన్, టేకింగ్ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లిందని చెప్పుకొచ్చింది.



## సేవ కోసమే..



ప్రిన్స్ మహేశ్‌బాబు ప్రధాన పాత్రలో నటించిన 'అతడు' మూవీ ఘన విజయం సాధించిన విషయం తెలిసిందే. దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ ఈ మూవీని తెరకెక్కించగా.. జయభేరీ బ్యానర్‌లో మురళీ మోహన్ నిర్మించాడు. రెండు దశాబ్దాల క్రితం 2005 ఆగస్టు 10న రిలీజ్ అయిన ఈ మూవీని ప్రిన్స్ మహేశ్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా వచ్చే నెల 9న రీ రిలీజ్ చేస్తున్నారు. అయితే ఇప్పుడు రీ రిలీజ్ చేసేది మాత్రం సేవా కార్యక్రమాల కోసమేనట. మూవీ రీ రిలీజ్ ద్వారా వచ్చే డబ్బులను మహేశ్ బాబు ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమాలకు ఉపయోగిస్తారట. ఈ విషయాన్ని నిర్మాత మురళీ మోహన్ వెల్లడించారు. ఇక ఈ మూవీని ఇప్పుడున్న టెక్నాలజీతో 8కె, 4కెలోకి మార్చారట. దీంతో ప్రేక్షకులకు కొత్త సినిమా అనుభూతి కలుగుతుందని చెప్పారు. మహేశ్‌బాబు, త్రివిక్రమ్ కాంబినేషన్‌లో వచ్చిన 'అతడు' మూవీ గ్రాండ్ సక్సెస్ కావడంతో ఆ ఇద్దరు మళ్లీ సమయం ఇస్తే సీక్వెల్‌ను కూడా జయభేరి బ్యానర్‌లో నిర్మిస్తామని మురళీ మోహన్ చెప్పాడు.

Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.